


ఉదయం ఆదేశం.. సాయంత్రం అమలు..

- మంత్రి తుమ్మల చొరవ..
- మార్కెట్‌లో ఆగమేఘాల మీద ఫైరింజన్ ఏర్పాటు



ఐజీ నాగిరెడ్డితో మాట్లాడుతున్న మంత్రి

ఖమ్మం మార్కెట్ ఆవరణలో ఫైరింజన్, సిబ్బంది

ఖమ్మం మార్కెట్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న విషయం విధితమే. గురువారం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్కెట్‌ను సందర్శించారు. ప్రమాదానికి గురైన వివరాలు తెలుసుకొని అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మార్కెట్‌కు ఒక ఫైరింజన్ కావాలని వెంటనే మంజూరు చేయండని అగ్నిమాపక శాఖ ఐజీ నాగిరెడ్డిని ఉదయం మార్కెట్ సందర్శనలో ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. దీంతో మంత్రి తుమ్మల ఆదేశాలతో ఫైర్ అధికారులు గురువారం రాత్రి 9 గంటలకే ఆఘమేఘాలమీద ఫైరింజన్‌ను, సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మార్కెట్ నూతన పాలక మండలి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, వైస్ ఛైర్మన్ తల్లాడ రమేష్, వ్యాపార వర్గాలు మంత్రి తుమ్మలకు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యవసాయ మార్కెట్‌కు రూ.100 కోట్లు

- త్వరలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- రాష్ట్రంలో మోడల్ మార్కెట్‌గా తీర్చిదిద్దుతాం
- మద్దులపల్లి మార్కెట్‌లోనూ మిర్చి కొనుగోళ్లు
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మార్కెట్‌లో అగ్నిప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను రాష్ట్రంలో మోడల్ మార్కెట్‌గా అభివృద్ధి చేయబోతున్నామని, రూ.100 కోట్లతో చేపట్టే పనులకు త్వరలోనే శంకుస్థాపన చేస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం పత్తి మార్కెట్‌లో అగ్నిప్రమాద సంఘటన దురదృష్టకరమని, ప్రమాద కారణాలపై 15రోజుల్లో నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

ఖమ్మంలోని పత్తి మార్కెట్‌లో బుధవారం రాత్రి అగ్నిప్రమాదం జరిగి రూ.14 లక్షల విలువైన పత్తి దగ్ధమైన నేపథ్యంలో గురువారం ఉదయం మంత్రి తుమ్మల కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ శ్రీజ, మార్కెటింగ్‌శాఖ డీఎం అలీమ్, కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, మేయర్ పునుకొల్లు నీరజతో కలిసి మార్కెట్‌ను సందర్శించారు. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందని, మార్కెటింగ్‌శాఖ అధికారులు తెలపగా, మార్కెట్‌లో కరెంట్‌వైర్లు ఎక్కడబడితే అక్కడ వేలాడతీయడమేంటని ప్రశ్నించారు. మళ్లీ అగ్నిప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఐజీ నాగిరెడ్డితో ఫోన్‌లో మాట్లాడి ఖమ్మం మార్కెట్‌లో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుచేయాలని, ఇందుకు సంబంధించిన అగ్నిమాపక శకటాన్ని కూడా శుక్రవారంలోగా ఖమ్మం పంపాలని సూచించారు. అందుకు ఐజీ అంగీకారం తెలిపారు. అనంతరం మార్కెట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడారు.

హైదరాబాద్‌లోని ఓఆర్, త్రిబుల్‌ఆర్ ఎయిర్‌పోర్టు సమీపంలో రూ.2వేల కోట్లతో ప్రపంచస్థాయి మెగా వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేయబోతున్నామని తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. 400ఎకరాల్లో ఏర్పాటయ్యే ఈ మెగా వ్యవసాయ మార్కెట్ అంతర్జాతీయ వ్యవసాయ మార్కెట్‌గా (మిగతా 6వ పేజీలో)

23న కేంద్ర బృందం రాక

- కొత్తగూడెం ఎయిర్‌పోర్టు స్థల పరిశీలనకు రంగం సిద్ధం

కొత్తగూడెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో ఈ నెల 20న ఎయిర్‌పోర్టు స్థల పరిశీలన కోసం రావాల్సిన కేంద్ర బృందం (ఏఏఐ) ఈనెల 23న పర్యటించ నుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం తెలిపారు. కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడితో మంత్రి తుమ్మల ఫోన్‌లో కేంద్ర బృందం పర్యటన కోసం చర్యలు తీసుకోవాలని కోరగా ఈనెల 23న జిల్లాకు బృందాన్ని పంపించేలా చర్యలు తీసుకుంటానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం పలు భూములు గుర్తించామని అక్కడ సర్వే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఇటీవల మంత్రి తుమ్మల కేంద్ర మంత్రికి లేఖ రాశారు. భద్రాద్రి జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ ప్రాంతాల్లోని విమానాశ్రయ ఏర్పాటు సాధ్యాసాధ్యాల పరిశీలనకు ఆరుగురు సభ్యుల ప్రత్యేక బృందం వస్తున్నట్లు వెల్లడించారు. ఈ బృందంలో ఏరో ప్లానింగ్ ఇంజనీరింగ్ అబ్దుల్ అజీజ్, ఆర్కిటెక్ట్ మహ్మద్ సఖీబ్, ఆపరేషన్స్ ఇంజనీర్ ప్రశాంత్ గుప్తా, సీఎన్‌ఎస్ ఆర్.దివాకర్, ఇంజనీరు మనీష్ జోన్వాల్, ఎఫ్‌పీడీ ప్రవీణ్ ఉన్నికృష్ణన్ వస్తున్నట్టు తెలిపారు. ఈ బృందం పర్యటనకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు చూడాలని, వారు కోరిన రెవెన్యూ డిపార్టుమెంట్ (భూసేకరణ), ఫారెస్ట్, వాటర్ రిసోర్సెస్ బృందాన్ని వారికి అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని భద్రాద్రి కలెక్టర్‌ను మంత్రి తుమ్మల ఆదేశించారు.

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులకు అందించేందుకు పకడ్బందీగా కార్యాచరణ చేపట్టినట్టు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రేషన్‌కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను అర్హులకే అందిస్తామని స్పష్టం చేశారు. ఈ విద్యా సంవత్సరంలో 'పది' 'ఇంటర్'లో నూరుశాతం ఫలితాల సాధనే లక్ష్యంగా కృషి చేస్తున్నామన్నారు. జిల్లాను పర్యాటకంగా తీసుకెళతామని తెలిపారు. గురువారం 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో పలు అంశాలపై కలెక్టర్ మాట్లాడారు.

-ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

- గ్రామసభల్లో పారదర్శకంగా ఎంపికలు
- అనర్హులకు అవకాశం ఇవ్వబోం
- లబ్ధిదారుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీల జోక్యం ఉండదు
- సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపిక నిరంతర ప్రక్రియ
- సర్వే వివరాల ఆధారంగానే కొత్త రేషన్‌కార్డులు
- రాజకీయ నాయకుల సిఫారసులను పట్టించుకోం
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



అర్హులకే ప్రభుత్వ పథకాలు

ప్రశ్న: రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జవాబు: జిల్లాలో 700పైగా గ్రామాలు, పట్టణాలు, వార్డు స్థాయినుంచి సర్వే నిర్వహిస్తున్నాం. ఈ నాలుగు పథకాలకు సంబంధించి సర్వే బృందాలను ఏర్పాటు చేశాం. 20నాటికి సర్వే పూర్తిచేసి గ్రామసభలు పకడ్బందీగా నిర్వహిస్తాం. ఈ గ్రామసభల్లోనే అర్హుల జాబితాను ప్రకటిస్తాం. అనర్హుల జాబితాను అక్కడే వివరిస్తాం.

ప్ర: ఇప్పటివరకు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు ఎన్ని? వాటినే ప్రాధాన్యతగా తీసుకుంటారా?

జ: ప్రజాపాలన గ్రామసభల్లోనే కాకుండా గతంలో వచ్చిన దరఖాస్తులు, ఇకపై గ్రామసభల్లో ఎవరైనా దరఖాస్తు చేసినా తీసుకుంటాం. అయితే వారిని వెయిటింగ్‌లిస్టులో ఉంచుతాం. జిల్లాలో రైతుభరోసాకు సంబంధించి 3,42,803మంది రైతులు 7.40 లక్షల ఎకరాల పైగా భూములు కలిగి ఉన్నారు. ఈ భూముల్లో చాలావరకు రియల్ ఎస్టేట్‌తోపాటు రోడ్లు, ఇతర నిర్మాణాలకు భూసేకరణ జరిగింది. కొండలు, గుట్టలు, కాలువలు, సాగు యోగ్యతలేని భూములన్నింటినీ గుర్తించి అనర్హులకు బహిరంగంగానే తెలియచేస్తాం.

ప్ర: ఇందిరమ్మ ఆత్మీయభరోసా లబ్ధిదారుల గుర్తింపులో ఇబ్బందులనెలా ఎదుర్కొంటారు?

జ: జిల్లాలో 3లక్షలకు పైగా జాబ్‌కార్డులుంటే ఏడాదిలో 20 రోజులు పనిచేసిన వారిని మాత్రమే ఆత్మీయభరోసా లబ్ధిదారులుగా గుర్తిస్తున్నాం. వారిలోనూ భూమిలేని వారికి మాత్రమే కుటుంబంలో ఒకరికి ఈ పథకం వర్తిస్తుంది. ఇప్పటికే దీనికి సంబంధించి లబ్ధిదారుల గుర్తింపు ప్రాథమికంగా పూర్తయ్యింది. జిల్లాలో 65నుంచి 70వేల వరకు ఆత్మీయభరోసా అందుకునే అవకాశం ఉంది.

ప్ర: రేషన్‌కార్డులకు (మిగతా 6వ పేజీలో)

'సంక్షేమ' సర్వే షురూ

- నాలుగు కొత్త పథకాలకు లబ్ధిదారుల ఎంపికపై కసరత్తు
- కేటాయించిన గ్రామాల్లో రంగంలోకి బృందాలు
- సాగు జరగని భూములపై క్షేత్రస్థాయిలో ఆరా
- 20 వరకు కొనసాగనున్న సర్వే
- 21 నుంచి జరిగే గ్రామసభల్లో అర్హుల ఎంపిక
- 26 నుంచి అమలు కానున్న పథకాలు



నేలకొండపల్లిలో భూముల సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఈనెల 26 నుంచి ప్రభుత్వం అమలు చేయబోతున్న నాలుగు సంక్షేమ పథకాలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో గురువారం సర్వే ప్రారంభమైంది. గ్రామ, మండలస్థాయిలో అర్హుల జాబితాల రూపకల్పన కోసం సర్వే సాగిస్తున్నారు. గురువారం నుంచి సోమవారం వరకు జరిగే ఈ సర్వేలో గ్రామస్థాయి కమిటీలు అర్హులు, అనర్హుల లెక్కలు తేల్చేందుకు కసరత్తు సాగిస్తున్నాయి. గ్రామాల్లో ఏఈవో, ఆర్‌ఐ, హౌజింగ్, రెవెన్యూ సిబ్బంది రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి సర్వే నిర్వహిస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో 700పైగా గ్రామాల్లో 1077 టీంలు సర్వే నిర్వహిస్తున్నాయి. గ్రామస్థాయిలో ఏఈవో, ఆర్‌ఐలు రైతుభరోసా, (మిగతా 6వ పేజీలో)



పోటెత్తిన ఎర్ర బంగారం

ఖమ్మం మార్కెట్‌కు 25వేల బస్తాల రాక

ఖమ్మం మార్కెట్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఎర్రబంగారం (తేజా రకం కొత్త మిర్చి) పోటెత్తింది. గురువారం సుమారు 25వేల మిర్చి బస్తాలు అమ్మకానికి వచ్చాయి. కొత్త మిర్చి సీజన్ ప్రారంభమయ్యాక తొలిసారిగా ఇంత భారీ మొత్తంలో రావడం ఇదే ప్రథమం. మార్కెట్‌కు ఆరు రోజులు వరుసగా సెలవులు ఉన్న నేపథ్యంలో గురువారం రైతులు పంటను భారీగా అమ్మకానికి తెచ్చారు. వారంరోజుల క్రితం రోజుకు 10 వేల బస్తాల వరకు వస్తుండగా.. ప్రస్తుతం 25వేల బస్తాలకు పైగా అమ్మకానికి వచ్చాయి. ఈ క్రమంలో మార్కెట్ యార్డులు ఉదయం 9గంటల వరకు బస్తాలతో నిండిపోయింది. ఇదిలా ఉండగా మార్కెట్లో క్వింటాలు మిర్చి రూ.15,400లు నిర్ణయించగా నాణ్యతను బట్టి క్వింటాలు రూ.14,000ల నుంచి రూ. 15,400ల వరకు వ్యాపారులు కొనుగోలు చేశారు. మిర్చి కొనుగోళ్లను మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి, గ్రేడ్ టు సెక్రెటరీ సృజన్‌కుమార్, అసిస్టెంట్ సెక్రెటరీ వీరాంజనేయులు తదితరులు సమీక్షించారు.

రేపు ఎన్టీఆర్ 29వ వర్ధంతి

నగరంలో సంగీత విభావరి, అన్నదానం

ఖమ్మం మామిళ్లగూడెం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని శనివారం నగరంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు జిల్లా పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్ తెలిపారు. ఉదయం 9 గంటలకు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం చేతుల మీదుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించనున్నట్టు తెలిపారు. కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి బైపాస్ రోడ్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పించనున్నట్టు తెలిపారు. ఉదయం 10:30 గంటలకు ఎన్టీఆర్ సినీ సంగీత విభావరి కార్యక్రమం జరుగుతుందని, మధ్యాహ్నం 12:30 గంటలకు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎన్టీఆర్ అభిమానులు, తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులు పార్టీలకతీతంగా పాల్గొనాలని ఆయన కోరారు.

కొత్త టీచర్లకు జీతాలేవీ?

- సాంకేతిక సమస్యతో 25 మందికి కష్టాలు
- రెండు నెలలుగా నిరీక్షణ

ఖమ్మం ఖానాపురం హవేలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2024లో ఉద్యోగం సాధించి, కొత్తగా కొలువులో చేరిన ఉపాధ్యాయులకు వేతన కష్టం వచ్చి పడింది. ఉద్యోగంలో చేరి మూడు నెలలు దాటినా.. ఖమ్మం జిల్లాలో ఇంకా వారికి తొలి వేతనం అందలేదు. టీచర్ల నియామకపు తేదీపై ప్రభుత్వం నుంచి స్పష్టత కొరవడటంతో జీతాల చెల్లింపు సందిగ్ధంలో పడింది. డీఎస్సీ - 2024లో ఎంపికైన 520మంది టీచర్లకు అక్టోబరు 10వ తేదీతో అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చారు. ఆ తర్వాత వారం రోజులకు జిల్లాల్లో కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్స్ ఇచ్చారు. దీంతో కొంతమంది టీచర్లు అక్టోబరు 15న, మరికొందరు అక్టోబరు 17న పాఠశాలల్లో చేరారు. ఒక తేదీతో రిక్రూట్మెంట్, మరో తేదీన పోస్టింగ్ చేతికందడంతో వేతనాల చెల్లింపునకు సాంకేతిక సమస్యలు వచ్చిపడ్డాయి. కొత్త టీచర్లకు అక్టోబరు 10 నుంచి వేతనాలిస్తామని విద్యాశాఖ ప్రకటించినా.. నేటికీ జిల్లాలో 25మంది ఉపాధ్యాయులకు జీతాలు అందలేదు. వారిలో కొందరికి పాన్ నెంబర్లు, మరికొందరికి డీడీవో కోడ్‌లలో సమస్యల కారణంగా జీతాలు అందలేదని మరో వారం రోజుల్లో అందరి సమస్యలు పరిష్కారమై జీతాలు పడతాయని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ తెలిపారు.

వర్గీకరణంలో ధర్మమే గెలుస్తుంది..

- అడుగడుగునా అడ్డుపడుతున్న మాలలు
- ఫిబ్రవరి 7న హైదరాబాద్‌కు తరలిరావాలి
- మాదిగలకే ప్రజలు, మేధావుల మద్దతు
- ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



సభలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

ఏన్కూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): దేశంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకుల మద్దతుతోపాటు సమాజం మద్దతు కూడా ఎంఆర్‌పీఎస్‌కే ఉందని, ధర్మమే గెలుస్తుందని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు కోరుతూ ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే వెయ్యి గొంతుకలు.. లక్ష డప్పులు సభను విజయవంతం కోరుతూ గురువారం ఏన్కూరు సాయిఠాగూర్ ఫంక్షన్‌హాల్‌లో జిల్లా సన్నాహక సమావేశం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్, కొమురంభీం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి భారీ ప్రదర్శనగా సభకు చేరుకున్నారు. ఈ సందర్భంగా జరిగన సభలో కృష్ణ మాదిగ మాట్లాడుతూ వర్గీకరణకు మాలలు అడుగడుగునా అడ్డుపడుతున్నారన్నారు.

కాంగ్రెస్ పార్టీ వర్గీకరణకు అనుకూలం అయినా కాంగ్రెస్ పార్టీలోని కొంతమంది మాల నాయకులు వ్యతిరేకమన్నారు. 1965లో లోకూర్ కమిషన్, 1994లో రామచంద్రరాజు కమిషన్లు వర్గీకరణకు అనుకూలంగా రిపోర్టు ఇచ్చినా మాలలు కమిషన్లను కూడా పక్కదారి పట్టిస్తున్నారన్నారు. ఎంఆర్‌పీఎస్ ఆవేదన, ఆకాంక్ష తెలియజేయడానికి ఇంటికో డప్పు చంకన పెట్టుకుని రావాలని కోరారు. మాదిగ బిడ్డల హక్కుల సాధన కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కూరపాటి సునీల్, ఏపూరి వెంకటేశ్వరరావు, ఇసనపల్లి అశోక్, కూరపాటి అంజయ్య, బచ్చలకూర వెంకటేశ్వర్లు, వంగూరి ఆనందరావు, తాళ్ల సురేష్, పమ్మి రవి, చిలక నాగరాజు, దామర్ల వీరయ్య, మండల అధ్యక్షుడు యంగల నరేష్, పూర్ణకంటి నాగరాజు, పూర్ణకంటి మైసారావు, సుందర్‌రావు, కొరకొప్పుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చివరిదశకు చేరిన పోరాటం...

పాల్వంచ టౌన్ (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు రాష్ట్రంలోని మేధావి వర్గం సంపూర్ణ మద్దతు తెలిపిందని ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ (మిగతా 6వ పేజీలో)

తెగని 'పంచాయతీ'

- మరుగునపడ్డ ఐదు పంచాయతీల విలీన సమస్య
- ఇరు రాష్ట్రాల అధికారుల సమావేశంలో చర్చకురాని అంశం
- ఆ ఐదు వస్తేనే భద్రాచలానికి భవిష్యత్తు

7



విధులు నిర్వహిస్తూ...



వెయిట్ లిఫ్టర్‌గా...

బహుముఖ ప్రజ్ఞాశాలి ఈ పద్మావతి

వృత్తితోపాటు పలు రంగాల్లో రాణింపు

మణుగూరు టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తాను నిర్వహించే వృత్తితోపాటు సమాజానికి ఉపయోగకరమైన పలు ప్రవృత్తుల్లో రాణిస్తూ బహుముఖ ప్రజ్ఞాశాలిగా, మరెందరికో స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది ఈ సింగరేణి ఉద్యోగిని. సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఆస్పత్రిలో సీనియర్ హెడ్ నర్సుగా విధులు నిర్వహిస్తున్న గోపిశెట్టి పద్మావతి సామాజిక సేవా, సాంస్కృతిక క్రీడల కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పని చేస్తూ గుర్తింపు తెచ్చుకున్నారు. మద్యం, గుట్కా, ఇతర చెడు వ్యసనాలకు వ్యతిరేకంగా పలు ఉద్యమ కార్యక్రమాలను నిర్వహించారు.

ఈ క్రమంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనకడుగు వేయలేదు. ప్లాస్టిక్ వాడకం నిరోధించడానికి అనేక కార్యక్రమాలను నిర్వహించారు. 2004లో సునామీ వచ్చి తీరప్రాంతం అతలాకుతలం అయినప్పుడు కార్మిక వాడల్లో తిరిగి దుస్తువులు ఎంచి పెట్టారు. ఉద్యోగాలకు గైర్హాజరవుతున్న పలు కుటుంబాలకు కౌన్సెలింగ్ ఇస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

నిరంతర విద్యార్థినిగా...

ఉద్యోగం చేస్తూ ఎమ్మెస్సీ నర్సింగ్ పూర్తి చేసిన పద్మావతి హాస్పిటల్ అండ్ హెల్త్ మేనేజ్‌మెంట్‌లో పీజీ డిప్లొమా పూర్తి చేసి ఎమ్మెస్సీ సైకాలజీలో కూడా పోస్టు గ్రాడ్యుయేషన్ పట్టా అందుకున్నారు.

క్రీడల్లోనూ ప్రతిభ..

1991లో సింగరేణిలో సాధారణ నర్సుగా ఉద్యోగం ప్రారంభించిన పద్మావతి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొని ఎన్నో బహుమతులను సాధించారు. గత 30ఏళ్ల వర్క్ మెన్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో పాల్గొని ప్రతీసారి బహుమతులు గెలుచుకుంటున్నారు. 25ఏళ్లుగా కోల్ ఇండియా లెవల్ అథ్లెటిక్ మీట్‌లో పాల్గొంటున్నారు. సింగరేణి నిర్మిస్తున్న పలు టెలీఫిల్మ్‌లలో నటించారు. పద్మావతి నివసించే క్వార్టర్‌లో మొక్కల పెంపకానికిగానూ ఎకో ఫ్రెండ్లీ హోం అవార్డు వరించింది.

సాధించిన అవార్డుల్లో కొన్ని...

1992లో సింగరేణి రిజనల్ అథ్లెటిక్ మీట్‌లో రెండో స్థానం, 800 మీటర్ల పోటీల్లో మొదటి స్థానం కైవసం చేసుకుంది. 2004లో పర్యావరణంపై సింగరేణి నిర్వహించిన ప్లేలెట్ నాటికలో రెండో బహుమతి గెలుచుకున్నారు. ఇదే ఏడాదిలో ఎన్విరాన్‌మెంట్ అవేర్‌నెస్‌లో భాగంగా ఏరియాలో ఎకో ఫ్రెండ్లీ అవార్డును గెలుచుకున్నారు. 2005లో సింగరేణి క్రీడల్లో మహిళా చాంపియన్ షిప్, 2007లో సింగరేణి స్థాయి ఫస్ట్ ఎయిడ్ కాంపిటేషన్‌లో మణుగూరు టీమ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించి ప్రథమ బహుమతిని గెలుపొందారు. 2008 సింగరేణిలో ఉత్తమ నర్సు అవార్డు అందుకున్నారు. 2024లో కార్పొరేట్ స్థాయిలో జరిగిన పవర్‌లిఫ్టు పోటీల్లోనూ, డిపార్టుమెంట్ స్థాయిలో జరిగిన అథ్లెటిక్ మీట్‌లో పాల్గొని నాలుగు ప్రథమ, రెండు ద్వితీయ బహుమతులను పొందారు.

అనాథాశ్రమం నెలకొల్పుతా: పద్మావతి

ఉద్యోగ విరమణ అనంతరం అనాథాశ్రమాన్ని నెలకొల్పి సేవ చేయాలని తన లక్ష్యమన్నారు. నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేసి యువతులకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తా. సేవా కార్యక్రమాలు చేయడానికి భర్త శ్రీనివాస్ ప్రోత్సాహం ఉందన్నారు.



వినూత్న రీతిలో వాహనదారులకు అవగాహన

కొత్తగూడెంలో గులాబీ ఇచ్చి హెల్మెట్ పెట్టుకోవాలని కోరుతున్న డీటీవో వెంకటరమణ

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రతి వాహనదారుడు రవాణా శాఖ, ట్రాఫిక్ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరుతూ భద్రాద్రి జిల్లా రవాణా శాఖ అధికారి(డీటీవో) వి.వెంకటరమణ వాహనదారులకు అవగాహన కల్పించారు. గురువారం కొత్తగూడెం రైల్వేస్టేషన్‌లో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా వాహనదారులకు గులాబీ పువ్వు ఇచ్చి హెల్మెట్ ధరించమని, రక్షణ చట్టాలను పాటించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా డీటీవో మాట్లాడుతూ వాహనదారులు రక్షణ సూత్రాలను పాటించి తమ కుటుంబం పట్ల బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. తమపై ఓ కుటుంబం ఆధారపడి ఉంటుందని గ్రహించి వాహనాలను నడపాలని సూచించారు. ఓవర్‌టేక్ చేస్తున్న సమయాల్లో సమయస్ఫూర్తిని కలిగి ఉండాలని కోరారు. డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు అన్ని ధ్రువపత్రాలు నిర్దిష్ట కాల పరిమితిలో ఉండేలా చూసుకుంటేనే బీమా సౌకర్యం లభిస్తుందని గుర్తు చేశారు. కార్లు నడిపే సమయాల్లో సీటు బెల్ట్ పెట్టుకుంటే సురక్షితంగా తమ ప్రయాణం కొనసాగుతుందని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కొత్తగూడెం త్రీటౌన్ ఎస్‌ఐలు విజయకుమారి, పురుషోత్తం, మస్తాన్, ఎంవీఐ మనోహర్, రవాణాశాఖ, త్రీటౌన్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గులాబీ ఇచ్చి హెల్మెట్ పెట్టుకోవాలని వాహనదారుడిని వేడుకుంటున్న డీటీవో వెంకటరమణ

వ్యవసాయరంగాన్ని దెబ్బతీసేందుకు బీజేపీ కుట్ర

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం

కొణిజర్ల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యవసాయరంగాన్ని కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తూ వ్యవసాయరంగాన్ని దెబ్బతీసే కుట్ర చేస్తోందని రైతుసంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, సీపీఐ జాతీయసమితి సభ్యుడు బాగం హేమంతరావు విమర్శించారు. మండల పరిధిలోని తనికెళ్లలో గుమ్మిడెల్లి సైదారావు అధ్యక్షతన జరిగిన రైతుసంఘం గ్రామశాఖ మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయరంగాన్ని దెబ్బతీయాలని చూసే కేంద్రంపై రైతుల పక్షాన ఉండి పోరాడతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు ఇచ్చిన ప్రతీహామీ అమలు చేసి మాట నిలబెట్టుకోవాలన్నారు. ఈ మహాసభలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, సీపీఐ జిల్లా నాయకులు యర్రాబాబు, పీవీ రావు, కూచిపుడి రవి, సీపీఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వర్లు, రైతు సంఘం మండల కార్యదర్శి సోమయ్య, ఎస్టీయూ జిల్లా నాయకులు గడల భాస్కర్‌రావు, గోపాలరావు, పెదమళ్ల రత్తమయ్య, లకావతు రాములు, బాస నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాగం హేమంతరావు

కమిటీ ఎన్నిక

మహాసభ సందర్భంగా రైతుసంఘం గ్రామశాఖ అధ్యక్షుడిగా గుమ్మిడెల్లి సైదారావు, ప్రధాన కార్యదర్శిగా లకావతు రాములు, ఆకుతోట శంకర్‌రావు, రామారావు, నరేష్, శ్రీనివాసరావుతోపాటు 13మంది కమిటీని ఎన్నుకున్నారు.

కొత్తగూడెం బస్టాండ్‌ను పరిశీలించిన

ఆర్టీసీ ఆర్‌ఎం



బస్ సర్వీసులను పరిశీలిస్తున్న ఆర్‌ఎం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్‌ను ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరాంనాయక్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. సంక్రాంతి పండుగ రిటన్ ట్రాఫిక్ క్లియరెన్స్ మానిటరింగ్‌ను స్వయంగా పర్యవేక్షించారు. ప్రయాణికులకు బస్సులు ఎలా ఏర్పాటు చేశారో ఆ సర్వీసులపై ఆరా తీశారు. అందుబాటులో హైదరాబాద్‌కు అదనపు సర్వీస్‌లను కూడా నడుపుతున్నట్లు, ఆ సర్వీసులను ఉపయోగించుకొని ప్రయాణికులు ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించాలని సూచించారు. ఆర్‌ఎం వెంట కొత్తగూడెం డిపో మేనేజర్ దేవేందర్‌గౌడ్, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు.

జూనియర్ ఆర్చరీ జట్ల ఎంపిక



ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో జూనియర్స్ విభాగంలో బాలుర, బాలికల ఆర్చరీ ఎంపికలు నిర్వహించారు. ఎంపికలకు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల నుంచి సుమారు 20 మంది బాలురు, 10మంది బాలికలు హాజరయ్యారు. ఎంపికలను ఇంటెలిజెన్స్ ఏసీపీ రామోజీ రమేష్, డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్టు జిల్లా ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి పుట్టా శంకరయ్య తెలిపారు. త్వరలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆర్చరీ అసోసియేషన్ ట్రెజరర్ డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, కోచ్‌లు నగేష్, మారెప్ప ఉన్నారు.

మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చేరేందుకు

దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కస్తాల సత్యనారాయణ

ఖమ్మం, ఖానాపురంహవేలి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లాలోని ఏడు తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కస్తాల సత్యనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికిగాను అడ్మిషన్ల ప్రక్రియ జనవరి 18నుంచి మొదలై ఫిబ్రవరి 28 వరకు ముగియనుందని, 5, 6, 7, 8 తరగతులలో ప్రవేశాలకు, ఇంటర్మీడియట్‌లో కళాశాలల్లో చేరే అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో తమ దరఖాస్తు వివరాలు నమోదు చేసుకోవాలని, ఇందులో 75 శాతం మైనారిటీస్ (ముస్లిమ్స్, క్రిస్టియన్స్, పార్సిస్, జైన్స్, సిక్కులు, బుద్ధిస్ట్), 25శాతం నాన్ - మైనారిటీస్ (ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ) ల కొరకు సీట్లు రిజర్వు చేసినట్టు, ప్రతీ కేటగిరీలో అనాథలు, వికలాంగులు, వితంతువుల, సైనిక ఉద్యోగ, విశ్రాంత ఉద్యోగుల పిల్లలకు 3 శాతం రిజర్వు చేయడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు ప్రిన్సిపాల్స్, మైనారిటీ గురుకుల పాఠశాలలు వారిని సంప్రదించాలని తెలిపారు.

'సంక్షేమ' సర్వే షురూ

(5వ పేజీ తరువాయి)

గ్రామ కార్యదర్శి రెవెన్యూ సిబ్బందితోపాటు ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరుల ఆధ్వర్యంలో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సర్వే నిర్వహిస్తున్నారు. ప్రధానంగా గ్రామాల్లో రెవెన్యూ రికార్డుల ద్వారా రియల్ ఎస్టేట్‌గా మారిన భూములు, భూసేకరణలో ప్రభుత్వ అవసరాల కోసం రోడ్లు, ప్రాజెక్టుల కాలువల తవ్వకాలకు సేకరించిన భూములను గుర్తిస్తున్నారు. ప్రతి మండలంలోనూ భూసేకరణ ద్వారా తీసుకున్న భూములు, రియల్ ఎస్టేట్‌గా మారిన భూములకు గతంలో రైతుబంధు మంజూరైనట్టు గుర్తిస్తున్నారు. నాలా కన్వర్షన్ అయిన రికార్డులను గుర్తించి అనర్హులను గుర్తిస్తున్నారు.

అశ్వారావుపేట మండలం ఆసుపాక గ్రామంలో 21మందికి సంబంధించి 20 ఎకరాల భూమిని అనర్హతగా గుర్తించారు. దమ్మపేట మండలం మొద్దులగూడెంలో 2ఎకరాలు, చంద్రుగొండ మండలం చెరువుశిఖం ఇటుక బట్టీలున్న ప్రదేశాలను రైతుబంధు తీసుకున్నట్టు గుర్తించారు. ఇల్లెందు, టేకులపల్లి, కామేపల్లి మండలాల్లో కూడా పలువురు అనర్హ రైతులను గుర్తించి గ్రామసభలకు వచ్చి వివరణ ఇవ్వాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 98 గ్రామాల్లో రైతు భరోసా సర్వే పూర్తిచేశారు. ఖమ్మంజిల్లాలో కూసుమంచి, సత్తుపల్లి, రఘునాథపాలెం, ఖమ్మంరూరల్, చింతకాని, కొణిజర్ల, తదితర మండలాల్లో కూడా రియల్ ఎస్టేట్‌గా మారిన ప్లాట్ల భూములకు రైతుబంధు అందుతున్నట్టుగా గుర్తించారు. మొత్తంగా మంత్రి మండలంలో 6 నుంచి7 శాతం అనర్హులైన రైతులు రైతుబంధు పొందినట్టుగా సర్వేలో తేలుతుంది.

ఈ నెల 20వతేదీ వరకు ఈ సర్వే పూర్తిచేసి 21 నుంచి జరిగే గ్రామసభల్లో అర్హుల జాబితా ప్రకటించబోతున్నారు. గ్రామసభల్లోనే అనర్హుల వివరాలు కూడా వెల్లడించనున్నారు. గడువు ముందుగానే సర్వే పూర్తిచేసి లబ్ధిదారులు జాబితా రూపొందించనున్నారు. మండలస్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, హౌజింగ్ అధికారులు, ఏవోలు మండల టీంలుగా ఏర్పడి సర్వే పరిశీలిస్తున్నారు. నియోజకవర్గాలకు ఏర్పాటుచేసిన స్పెషలాఫీసర్లు కూడా సర్వేను మొదటిరోజు పర్యవేక్షించారు. ఖమ్మంకు అడిషనల్ డీఆర్‌డీఏ నూరుద్దీన్, పాలేరుకు ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, వైరాకు డీఎల్‌పీవో రాంబాబు, సత్తుపల్లికి కల్లూరు ఆర్డీవో రాజేందర్‌గౌడ్, మధిరకు డీపీవో ఆశాలత పర్యవేక్షణ చేస్తున్నారు.

రైతు భరోసాకు సంబంధించి ఖమ్మం జిల్లాలో 3.42 లక్షల మంది రైతులకు చెందిన 7.40లక్షల ఎకరాల భూములు భద్రాద్రి కొత్తగూడెంలో 1.85 లక్షల మంది రైతులు 5.99లక్షల ఎకరాలకు భూములకు సంబంధించి వివరాలు సేకరిస్తున్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు సంబంధించి ఖమ్మంజిల్లాలో 3.06 లక్షల ఉపాధి జాబ్‌కార్డుల వారి వివరాలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2.19లక్షల జాబ్‌కార్డులవారి వివరాలను సేకరించి భూమిలేని నిరుపేదలు 20రోజులపాటు ఉపాధి హామీలో పాల్గొన్న వారిని గుర్తిస్తున్నారు. రేషన్‌కార్డులకు సంబంధించి ఖమ్మంజిల్లాలో 30,665 కొత్త దరఖాస్తులు, 10,884 మార్పులకోసం వచ్చిన దరఖాస్తులను సర్వే చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెంలో 43,061 దరఖాస్తులు ను సర్వే నిర్వహిస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల కింద ఖమ్మంజిల్లాలో 3.57లక్షల దరఖాస్తులు. భద్రాద్రి కొత్తగూడెంలో 2.73లక్షల దరఖాస్తులను సర్వే చేస్తున్నారు. మొత్తంమీద ఈనెల 21లోగా సర్వే పూర్తిచేసి గ్రామసభల్లో అర్హుల జాబితా సిద్ధం చేయబోతున్నారు.

తొలిరోజు 98 రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తి...

కొత్తగూడెం అర్బన్: రైతు భరోసా పథకం అమలులో భాగంగా సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించేందుకు ప్రభుత్వం వ్యవసాయ క్లస్టర్ల వారీగా బృందాలను నియమించింది. వీరంతా గురువారం నుంచి నాలుగు రోజులపాటు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అర్హులైన రైతులను గుర్తించి జాబితాలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లావ్యాప్తంగా 67 వ్యవసాయ క్లస్టర్లు ఉన్నాయి. జిల్లాలో ఆర్వోఎఫ్ఆర్ మినహాయించి 3.30లక్షల ఎకరాలు వ్యవసాయ భూములుండగా 1.23లక్షల మంది రైతులు సాగు చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 393 రెవెన్యూ గ్రామాలుండగా తొలిరోజు (గురువారం) 98 రెవెన్యూ గ్రామాల్లో రైతు భరోసా పథకం సర్వేను పూర్తి చేశారు. రెవెన్యూ గ్రామాల్లో సబ్ డివిజన్‌లుగా విభజించి సర్వే చేస్తున్నారు. గురువారం నుంచి 20వ వరకు అందుబాటులో ఉన్న నివేదికల ఆధారంగా సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించేందుకు సమాయత్తమయ్యారు. పరిశీలన బృందాల పనితీరును పర్యవేక్షించే బాధ్యతలను మండలస్థాయిలో తహసీల్దార్, వ్యవసాయ శాఖ ఏవోకు, డివిజన్ స్థాయిలో ఆర్డీవోలకు అప్పగించారు.



కొత్తగూడెంలో భూములను సర్వే చేస్తున్న సిబ్బంది

కాగా, ధరణి పోర్టల్ వివరాలు, గ్రామ పంచాయతీ, మునిసిపల్ పట్టణాలు, ఇతరశాఖల నివేదికల ఆధారంగా సాగుకు యోగ్యం కాని భూముల ఏరివేత పూర్తయ్యిందని అధికారులు చెబుతున్నారు. క్రాప్ బుకింగ్ పోర్టల్‌లోని వివరాలను సాగుకు యోగ్యం కాని భూముల గుర్తింపునకు ప్రామాణికంగా తీసుకున్నారు. గత నాలుగు సంవత్సరాల నుంచి ఏఈవోలు క్రాప్ బుకింగ్ పోర్టల్‌లో పంటలు వేయనట్టు నమోదు చేస్తే, సదరు భూముల వివరాలను తొలగిస్తున్నారు.

అనర్హులకు కోతే...

సాగు చేయని భూములకు రైతు భరోసా కట్ కానున్నది. వెంచర్‌లు, పెట్రోల్ బంక్‌లు, గుట్టలకు రైతు భరోసా వస్తే నిలిపి వేయనున్నారు. సర్వేను అధికారులు పకడ్బందీగా చేస్తే మండలంలో కూడా పలు రియల్ ఎస్టేట్ వెంచర్లు, సాగు చేయని గుట్టలు, బోడులు బయట పడనున్నాయి. ఐదు రోజుల సర్వే అనంతరం అధికారులు పూర్తిగా వ్యవసాయేతర భూములను నిర్ధారించనున్నారు. కొన్ని వ్యవసాయ భూముల్లో మిర్చి, ధాన్యం నిల్వల కోసం గోదాములు ఏర్పాటు చేశారు వాటిపై కూడా ప్రభావం పడనుంది.

వ్యవసాయ మార్కెట్‌కు రూ.100 కోట్లు

(5వ పేజీ తరువాయి)

అందుబాటులోకి రానుందని, దీనికి త్వరలోనే శంకుస్థాపన చేయబోతున్నామని పేర్కొన్నారు. ఖమ్మం మార్కెట్‌లో మిర్చిఘాటు అధికంగా ఉన్నందున ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, అందువల్లే మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ మంజూరు చేశామని, 15 రోజుల్లో అక్కడ మిర్చి కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రైతు సంఘం నాయకుడు నల్లమల వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ వై.హనుమంతరావు, వైస్ చైర్మన్ తల్లాడ రమేష్, కార్పొరేటర్ మురళి, ముదిగొండ సొసైటీ అధ్యక్షుడు యలగొండస్వామి పాల్గొన్నారు.

అర్హులకే ప్రభుత్వ పథకాలు

(5వ పేజీ తరువాయి)

సంబంధించి పాతకార్డుల స్థానంలో కొత్తకార్డులు ఇస్తారా? కొత్తవారికే కార్డులు మంజూరుచేస్తారా?

జ: పాత కార్డులున్నవారికి వాటి స్థానంలో కొత్త కార్డులు ఏమీ ఉండవు. అయితే ఆ కుటుంబంలో పేర్లు చేర్చాలన్నా, తీసివేయాలన్నా మార్పులు చేర్పులు చేసి కొత్త కార్డు ఇస్తాం. అలాగే కొత్తకార్డుల కోసం దరఖాస్తు చేసిన వారికి దరఖాస్తులు పరిశీలించి మంజూరు చేస్తాం. కొత్తగా గ్రామసభల్లో ఎవరైనా దరఖాస్తు ఇచ్చినా తీసుకుంటాం.

ప్ర: ఇందిరమ్మ ఇళ్లు ఏజెన్సీ మండలాల్లో గిరిజనేతరులకు మంజూరుచేసే అవకాశం ఉందా?

జ: ప్రజాపాలనలో 3 లక్షల 57వేల దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 3లక్షల 38వేల వరకు సర్వే పూర్తి చేశాం. మిగిలినవి కూడా సర్వే చేస్తున్నాం. అయితే ఇంటి స్థలానికి సంబంధించి పత్రాలు లేకపోయినా విద్యుత్ బిల్లు, ఇంటిపన్ను ఆధారాలను పరిశీలించి పేదవారికి ఇళ్లు మంజూరు చేస్తాం. గతంలో అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లను సైతం పూర్తి చేసేందుకు లబ్ధిదారులుగా గుర్తించి నిధులు మంజూరు చేస్తాం.

ప్ర: లబ్ధిదారుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీల జోక్యం ఎంతవరకు ఉంటుంది? రాజకీయ నేతల నుంచి సిఫారసులు వచ్చే అవకాశం లేదా?

జ: లబ్ధిదారుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీల జోక్యం ఉండదు. గ్రామాల్లో వారు సిబ్బందికి లబ్ధిదారుల సమాచారం, వారి వివరాలను మాత్రమే తెలియజేస్తారు. లబ్ధిదారుల ఎంపికలో సర్వే బృందాలు మాత్రమే నిర్ణయం తీసుకుంటాయి. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎవరైనా సిఫారసు చేసినా అర్హత ఉన్న వారికి మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఆత్మీయభరోసా అందుతుంది.

ప్ర: పది, ఇంటర్ పరీక్షా ఫలితాలు మెరుగుకు శాఖపరంగా చేపడుతున్న చర్యలు ఏంటి?

జ: నూరుశాతం ఫలితాలు సాధించాలన్నదే నా లక్ష్యం. ఇందుకు అనుగుణంగా ఏ, బీ, సీ గ్రూపులుగా విద్యార్థులను విభజించి సీ-గ్రూప్‌లో వీక్‌గా ఉన్న విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. సాయంత్రం వారికి పరీక్షకు సంబంధించిన సమాచారం అందిస్తున్నాం. ప్రతి ఒక్కరు 10/10 కాకపోయినా పూర్తిస్థాయిలో పాస్ కావాలన్నది తమ విధానం. విద్యార్థుల్లో పరీక్షల పట్ల భయం పోగొట్టేందుకు మోటివేషన్ తరగతులు ఏర్పాటు చేస్తున్నాం.

ప్ర: ధాన్యం కొనుగోలు ముగిసినట్లేనా?

జ: జిల్లాలో ధాన్యం కొనుగోలు ముగింపు దశకు చేరింది. గత ఏడాది లక్షా 40వేల మె.టన్నులు కొనుగోలు చేయగా ఈసారి 2.60 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం రూ.586 కోట్లతో కొనుగోలు చేశాం. తద్వారా రూ.112కోట్లను రైతులకు బోనస్‌గా చెల్లించాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడగాలిగాం.

వర్గీకరణంలో ధర్మమే గెలుస్తుంది: మందకృష్ణ

(5వ పేజీ తరువాయి)

మాదిగ పేర్కొన్నారు. పాల్వంచలోని లారీ అసోసియేషన్ హాల్లో గురువారం నిర్వహించిన సభలో ఆయన పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అక్కడ నుంచి వందలాదిమంది కార్యకర్తల డప్పు దరువుల ప్రదర్శన మధ్య సభావేదికకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30ఏళ్ల వర్గీకరణ పోరాటం చివరి దశకు చేరిందని, ఆఖరి పోరాటానికి అందరూ సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. వర్గీకరణ పోరాటానికి రాష్ట్రం, దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు, మేధావుల పూర్తి మద్దతు ఉందన్నారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో ప్రత్యక్ష పోరుకు దిగుతున్నామన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గీకరణ అమలును జాప్యం చేయవద్దని అన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కొత్తపల్లి సోమయ్య, తిరుపతయ్య, కత్తి శ్రీను, సిద్దెల హుస్సేన్, వంగూరి నరసింహారావు, మిరియాల వెంకటేశ్వర్లు, దాసరి శ్రీనివాస్, ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి సారథితోపాటు రాష్ట్ర, జిల్లా, మండలస్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాల్వంచలో డప్పు వాయిస్తున్న మందకృష్ణ మాదిగ

యూరియా కొరత లేకుండా చూడాలి

వైరా, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరత లేకుండా ఫ్రీ మార్కెట్ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం వైరా మండలం పూసలపాడులో రైతు సమస్యలపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్లో పంటల సాగుకు అవసరమైన ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కమి టీ సభ్యులు శ్రీనివాసరావు, సీఐటీయు జిల్లా నాయకులు నాగేశ్వరరావు, మం డల నాయకులు నాగేశ్వరరావు, పూసలపాడు సొసైటీ మాజీ వైస్ చైర్మన్ గాలి అరుణకుమారి, రైతు సంఘ నాయకులు మధు, శివ, ప్రేమసాగర్, రాధా పాల్గొన్నారు.

దేవస్థానం ఆధ్వర్యంలో వస్త్రాల సేకరణ ప్రారంభం

- ముగిసిన కాంట్రాక్టరు కాలపరిమితి
- డిజిటలైజేషన్‌తో వస్త్రాల సేకరణ




బార్ కోడింగ్‌తో వస్త్రాల సేకరణ, డిజిటల్ కార్డు

భద్రాచలం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో భక్తుల నుంచి వస్త్రాల సేకరణ గురువారం ప్రారంభమైంది. ఇప్పటి వరకు వస్త్రాల సేకరణ నిర్వహించిన కాంట్రాక్టరు కాలపరిమితి బుధవారంతో ముగియటంతో దేవస్థానం అధికారులే స్వయంగా భక్తుల నుంచి వస్త్రాల సేకరణను నిర్వహిస్తున్నారు. భక్తులు స్వామి వారికి తమ కోరికలు తీరితే వస్త్రాలు సమర్పిస్తామని మొక్కుకుంటారు. ఈ క్రమంలో వారు ఇచ్చిన వస్త్రాలను ఆలయంలో మూలవరుల వద్ద సమర్పించి అనంతరం కాంట్రాక్టరుకు దేవస్థానం అధికారులు అందజేయటం జరుగుతోంది. అయితే రూ.39.05 లక్షలలో గత ఏడాది టెండరును దక్కించుకున్న కాంట్రాక్టరు కాలపరిమితి బుధవారంతో ముగిసింది. ఈ క్రమంలో దేవస్థానం టెండర్లను పిలువగా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవటంతో వాయిదాపడింది. ఈ విధంగా పలుమార్లు టెండర్లను నిర్వహించినా కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవటంతో ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. దీంతో దేవస్థానమే టెండర్ల ప్రక్రియ నిర్వహించేంత వరకు వస్త్రాల సేకరణ చేపట్టేందుకు సిద్దమయ్యింది.

డిజిటలైజేషన్‌తో వస్త్రాల సేకరణ

దేవస్థానం గురువారం నుంచి వస్త్రాలను భక్తుల దగ్గర సేకరించే ప్రక్రియకు శ్రీకారం చుట్టగా ఇందుకు బార్ కోడింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారు. భక్తులు ఇచ్చిన వస్త్రాలు ఫోటో తీసి స్వీకరిస్తున్నారు. ఈ సమయంలో ఇందుకు సంబందించిన డిజిటల్ కార్డును సంబంధిత భక్తులకు అందజేస్తున్నారు. మళ్లీ అదే బార్‌కోడింగ్‌తో భక్తులకు విక్రయించనున్నారు. దీని ద్వారా పూర్తి పారదర్శకతకు అవకాశం ఉంటుందని దేవస్థానం అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా దేవస్థానంలో ఇప్పటికే వసతి, దర్శనాలు ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉండగా ప్రోటోకాల్, అన్నదానం డిజిటలైజేషన్‌లో ఉన్నాయి. అదనంగా వస్త్రాల సేకరణ సైతం డిజిటలైజేషన్ ద్వారా చేపట్టడం జరుగుతోంది. అయితే ఇక నుంచి వస్త్రాల సేకరణ ఎవరైనా కాంట్రాక్టరు వేలంలో దక్కించుకున్నా వారు ఈ విధానాన్ని తప్పక అమలు చేయాల్సి ఉంటుందని దేవస్థానం అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. దీని ద్వారా వస్త్రాల సేకరణలో ఎంత మొత్తంలో దేవస్థానం, కాంట్రాక్టరుకు వస్తుందనేది తెలుస్తుంది అని దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి.

ఐసీడీఎస్‌లో ఖాళీల భర్తీ ఎప్పుడు?

- నూతన నియామకాలు లేక ఇబ్బందులు
- పనిభారంతో ఇక్కట్లు ఎదుర్కొంటున్న ఉద్యోగులు



కొత్తగూడెం అర్బన్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చిన్నారుల కోసం ఏర్పాటుచేసిన అంగన్‌వాడీ వ్యవస్థ అస్తవస్యంగా మారింది. అంగన్‌వాడీ పోస్టులు భర్తీ చేయకపోవడం వల్ల పలు సెంటర్లలో ఉపాధ్యాయులు లేక వెలవెలపోతున్నాయి. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీ విద్యావ్యవస్థల తీరుఇది..

జిల్లాలో భర్తీకి నోచుకోని 191టీచర్లు... 960 ఆయా పోస్టులు

ఐసీడీఎస్ కింద 11ప్రాజెక్టల పరిదిలో 2060 కేంద్రాల్లోని ఖాళీలను భర్తీ చేయాల్సిన ప్రభుత్వాలు జాప్యం చేస్తున్నాయి. జిల్లాలో మొత్తం 191మంది అంగన్‌వాడీ ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయి. దీంతో సమీప కేంద్రాల ఉపాధ్యాయులకు వాటి నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తున్నారు. అక్కడ ఉన్న ఆయాలు తమ పనితో పాటు ఉపాధ్యాయుల పాత్ర కూడా పోషించాల్సిన దుస్థితి నెలకొంది. ఆయా స్థానాలు 960 ఖాళీలు ఉన్నాయి. ఇక్కడ పనిచేసే ఉపాధ్యాయులు తమ విదులతో పాటు ఆయాలు చేసే వంట పని, పరిశుభ్రత, పిల్లలను కేంద్రాలకు తీసుకెళ్లతూ ద్విపాత్రభినయం పోషిస్తూ సతమతమవుతున్నారు. కొత్త ప్రభుత్వం ఏడాది గడిచిన ఖాళీలపై దృష్టి పెట్టకపోవడం, సగం కేంద్రాల్లో ఖాళీలు ఉండటంతో కేంద్రాల నిర్వహణ అటు ఆయాలకు, ఇటు ఉపాధ్యాయులకు అదనపు భారంతో ఇబ్బందిగా మారింది. ఈ కేంద్రాల్లో గర్భవతులకు, బాలింతలకు అందించే పోషక ఆహారం పంపిణీ అలస్యం అవుతుంది.

ఏజెన్సీ ప్రాంతాల్లో పరిస్థితి ఇది..

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులకు ఆట, పాట, చదువులు అందించి పటిష్టమైన భావితరాన్ని తీర్చిదిద్దేందుకు అంగన్‌వాడీ కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ప్రతి సంవత్సరం బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాల్లో చేర్పించి విద్యాబుద్దులు నేర్పేందుకు విద్యాశాఖ విన్నూత్న కార్యక్రమాలతో ప్రజలకు చేరువ అవుతుంది. జిల్లావ్యాప్తంగా 2000పైచిలుకు ఏజెన్సీ గ్రామాలున్నాయి. సూదూర అటవీ ప్రాంతాలున్న గిరిజన గ్రామాల్లో నూతనంగా అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటుచేయకపోవడంతో ప్రభుత్వం లక్ష్యం నీరుగారుతుంది.

ఖాళీలు ఇలా ఏర్పడ్డాయి..

జిల్లాలో కొందరు ఉపాధ్యాయులు, ఆయాలు వ్యక్తిగత కారణాలతో ఉద్యోగాలు వదులుకున్నారు. మరికొందరు అనారోగ్యంతో, ఇటీవల వయస్సు మీరడంతో ఉద్యోగాలు వదులుకోవాల్సి వచ్చింది. 120 పోస్టులు కోర్టు కేసులతో పెండింగ్‌లో ఉన్నాయని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే భర్తీ చేస్తామని, కొత్తగా సెంటర్లు ఏర్పాటు చేయాలని దరఖాస్తులు సమర్పిస్తే ఏర్పాటుకు కృషిచేస్తామని ఐసీడీఎస్ జిల్లా సంక్షేమ అధికారిణి స్వర్ణలత లెనీనా తెలిపారు.

జిల్లాలో 2060 అంగన్‌వాడీ కేంద్రాలు..

జిల్లాలో సమగ్ర శిశు అభివృద్ధి పథకం (ఐసీడీఎస్) కింద 11ప్రాజెక్టుల పరిధిలోని 84సెక్టార్లలో 2060కేంద్రాల్లో 1869మంది టీచర్లు, 1100మంది ఆయాలు విధులు నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాల్లో 31,268 మంది 7నెలల నుంచి 3ఏళ్ల వరకు చిన్నారులు, 25,184మంది 3నుంచి 6ఏళ్లవరకు చిన్నారులు ఉన్నారు. వీటిల్లో 3 సంవత్సరాల నుంచి చిన్నారులకు ఆట, పాట, చదువులు అందించి పటిష్టమైన భావితరాన్ని తీర్చిదిద్దే అంగన్‌వాడీ కేంద్రాలు. ఈ కేంద్రాల్లో 6,092మంది గర్భిణులు, 6,989మంది బాలింతలు ఉన్నారు. గర్భిణులకు, బాలింతలకు చిన్నారులకు పోషకాహారం అందిస్తాయి.

కీలక పోస్టుల ఖాళీ

జిల్లాలోని ఐసీడీఎస్‌లో కీలకమైన బాధ్యతలు పర్యవేక్షించే అడ్మినిస్ట్రేషన్‌లో విభాగంలో నలుగురు సీనియర్ అసిస్టెంట్ పోస్టులతో పాటు డేటా ఎంట్రీ అపరేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 13మంది సీనియర్ అసిస్టెంట్లకు 9మంది పనిచేస్తున్నారు. జిల్లా కార్యాలయంలో పలువురు అధికారులు డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాలకు, ఒక సీనియర్ అసిస్టెంట్ మెడికల్ లీవ్‌పై వెళ్లటంతో పరిపాలన భారమై పనివత్తిడితో సతమతమవుతున్నారు. జిల్లాలోని 84సెక్టార్‌లలో 81 మంది సూపర్‌వైజర్ శాంక్షన్ పోస్టులుండగా.. 72మంది సూపర్‌వైజర్లు విధులు నిర్వహిస్తున్నారు. ఖాళీగా ఉన్న 9మంది సూపర్‌వైజర్ పోస్టులు భర్తీకాలేదు. ఒకవైపు 12మంది సూపర్‌వైజర్ల పోస్టులు ఖాళీగా ఉండటంతో మరోవైపు అదనపు బాధ్యతలతో సూపర్‌వైజర్ల పర్యవేక్షణ కొరవడింది. ప్రధానంగా ఐసీడీఎస్ కార్యక్రమాలపై అవగాహన, లక్ష్యాల అమలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సెంటర్లలో పోషక ఆహారం, బాల్యవిద్యా సేవ లు, ఆరోగ్య పరీక్షలతో పాటు పర్యవేక్షణ, హాజరు, లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు, ఆందోళనల పరిష్కారం, సేవల పంపిణీ ట్రాకింగ్, పోషక ఆహార లోపం ఉన్న వారి గుర్తింపులో టీచర్ల పనితీరు, ఇంటింటికి పంపిణీ చేసే సరుకులు, గర్భిణులు, బాలింతలు, ప్రీ స్కూల్ పిల్లలకు పోషక ఆహారాలు పంపిణీ తీరు పర్యవేక్షణ, ప్రీ స్కూల్‌లో బోధన పద్దతుల పర్యవేక్షణ, కేంద్రాల్లో నమోదు తీరు, ప్రతి నెల చివరివారంలో సెక్టార్ సమావేశం నిర్వహించి నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు సమర్పిస్తారు.

ఎన్‌హెచ్‌ఎంలో ఉద్యోగాలకు దరఖాస్తుల పరిశీలన

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఎన్‌హెచ్‌ఎం విభాగంలో తాత్కాలిక కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ పద్ధతిలో 19 ఎంఎల్‌హెచ్‌పీ, 3 టీడీకే మెడికల్ ఆఫీసర్ పోస్టులు భర్తీ అందిన దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ బి కళావతి తెలిపారు. ఎంబీబీఎస్, బీఏఎంఎస్, బీఎస్సీ నర్సింగ్‌తో పాటుగా 6 నెలల బ్రిడ్జి కోర్స్ (ఇగ్నో) అర్హతలు ఉన్న అభ్యర్థుల నుంచి 1014 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. అభ్యర్థుల ప్రొవిజనల్ మెరిట్ లిస్టులు ప్రభుత్వ వెబ్‌సైట్‌లో వివరాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అభ్యర్థులు 18 సాయంత్రం 5 గంటల వరకు అభ్యంతరాలను తెలపాలన్నారు. అవసరం ఉన్న అన్ని సర్టిఫికెట్లను జీరాక్స్‌లతో దరఖాస్తుతో జరపరిచి డీఎంహెచ్‌వో కార్యాలయంలో అందచేయాలని ఆమె కోరారు. మెరిట్ లిస్టు కోసం khammam.telangana.gov.inను సందర్శించాలని ఆమె తెలిపారు.

ఈవీఎం గోదాం వద్ద పటిష్ట భద్రత ఉండాలి

ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



రికార్డులో సంతకం చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఈవీఎం గోదాం వద్ద పటిష్ట నిఘాతో భద్రతా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. గురువారం ఆయన కలెక్టరేట్ ఆవరణంలో ఈవీఎం గోడౌన్ తనిఖీ చేశారు. ఈవీఎం గోదాం సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలు, సీసీ కెమెరాలను పరిశీలించి, పనిచేస్తున్నవి, లేనిది అడిగి తెలుసుకున్నారు. భద్రతా సిబ్బంది షిఫ్టుల వారీ విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. భద్రతా లోపాలు లేకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ సీహెచ్ స్వామి, ఎన్నికల డీటీ అన్సారీ తదితరులున్నారు.

కృష్ణయ్య చెంత రామయ్యకు రాపత్తు సేవ



గోకుల మండపంలో రామయ్యకు రాపత్తు సేవ

భద్రాచలం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాపత్తు సేవల్లో భాగంగా గురు వారం శ్రీ కృష్ణ ఆల యంలోని గోకుల మండపంలో రామయ్యకు రాపత్తు సేవ నిర్వహిం చారు. తొలుత స్వామి వారిని ఆలయం నుంచి మేళతాళాలు, భాజభజంత్రీలు, వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ తీసుకొచ్చి వేదికపై స్వామి వారిని ఆసీనులను చేశారు. అనంతరం స్వామివారికి విష్వక్సేన పూజా, పుణ్యాహవచనం, తదితర ప్రత్యేక పూజలు, వేద స్వస్తిని వైదిక సిబ్బంది నిర్వహించారు. ఈ సమయంలో భక్తులు అధి క సంఖ్యలో స్వామి వారిని దర్శించి తీర్థ ప్ర సాదాలు స్వీకరించారు.

మునిసిపల్ కమిషనర్ పేరుతో బెదిరింపులు

ఇల్లెందు టౌన్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు పట్టణంలోని పలువురు వ్యాపారులకు ఓ అపరిచిత వ్యక్తి తాను మునిసిపల్ కమిషనర్‌ను మాట్లాడుతున్నానని, ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. గత రెండు రోజులుగా వ్యాపారులకు ఫోన్ చేస్తూ.. తక్షణమే లైసెన్సులు పొందాలని, లేకుంటే వ్యాపారాలు సీజ్ చేస్తామని చెబుతుండటం గమనార్హం. గురువారం కొంతమంది వ్యాపారులు ఈ విషయాన్ని మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్ దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

కల్లూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన కల్లూరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. కల్లూరుకు మొగిలిచర్ల ప్రతాప్ (38) ఆర్థిక ఇబ్బందులతో కొంత కాలంగా ఇబ్బందులు పడుతున్నాడు. ఈక్రమంలో బుధవారం రాత్రి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో క్రిమిసంహారక మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతడిని ఖమ్మంలోని ఓ ప్రయివైట్ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుడి సోదరుడు మొగిలిచర్ల ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిత తెలిపారు.

గొంతులో గారె ఇరుక్కొని వృద్ధురాలి మృతి

తల్లాడ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): గొంతులో గారె ఇరుక్కొని ఊపిరి ఆడక వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన తల్లాడలో చోటు చేసుకొంది. వివరాల ప్రకారం.. తల్లాడకు చెందిన మొక్క తిరుపతమ్మ (80) అనే వృద్ధురాలు గారె తింటుండగా గొంతులో ఇరుక్కొపొయి ఊపిరి ఆడక బుధవారం రాత్రి తన ఇంట్లో మృతి చెందింది. సంక్రాంతి పండుగ సందర్భంగా చిన్నకుమారుడు శ్రీను తల్లి తిరుపతమ్మకు గారెలు పంపాడు. ఆ గారెలు తింటుండగా గొంతులో ఇరుక్కొపోయి మృతి చెందింది. తిరుపతమ్మకు ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. కుమార్తె కమలమ్మ ఫిర్యాదు మేరకు గురువారం ఎస్ఐ కొండలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ కాల్వలో దూకిన వ్యక్తి గల్లంతు

ఖమ్మం రూరల్ జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సాగర్ కాల్వలో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలోని పోలేపల్లి పంచాయతీ పరిధిలో గురువారం చోటుచేసుకుంది. పోలేపల్లి పంచాయతీ దివ్యాంగుల కాలనీకి చెందిన సంగోజు పుల్లాచారి(58) కులవృత్తి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొంత కాలంగా పనులు సక్రమంగా లేకపోవడంతో మద్యానికి అలవాటు పడ్డాడు. అనారోగ్య పరిస్థితులు తట్టుకోలేక గురువారం మధ్యాహ్నం తన ద్విచక్రవాహనంపై సాగర్ కాల్వకట్టపై వాహనం నిలిపి కాల్వలో దూకి గల్లంతయ్యాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కాల్వలో దూకిన వ్యక్తి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. ఈ సంఘటనపై పుల్లాచారి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రాజు తెలిపారు.

తిరుమలకుంటలో పేకాట శిబిరంపై దాడి

అశ్వారావుపేట రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): పేకాట శిబిరంపై పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. మండలంలోని తిరుమలకుంట కాలనీ సమీపంలో గల మామిడితోటలో కొందరు పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ యయాతిరాజు తన సిబ్బందితో దాడులు జరిపారు. దాడుల్లో రూ.3,500 నగదును, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైరా సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్

వైరా జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వైరా సబ్‌రిజిస్ట్రార్ బి.రామచంద్రయ్యపై సస్పెన్షన్ వేటు పడింది. గురువారం రాత్రి సస్పెన్షన్ ఉత్తర్వులు వెలుగులోకి వచ్చాయి. గత ఏడాది డిసెంబరు 28వ తేదీన ఒకేరోజు 89 రిజిస్ట్రేషన్లు అర్థరాత్రి వరకు జరిగాయి. అయితే వాటిలో 64 రిజిస్ట్రేషన్లు అర్థరాత్రి వరకు చేయడంపై రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదులందాయి. ఆ ఫిర్యాదు మేరకు విచారణ కోసం స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. వరంగల్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ పంపించిన నివేదిక మేరకు రామచంద్రయ్యను సస్పెన్షన్ చేశారు. గత నెల డిసెంబరు 28 అర్థరాత్రి వరకు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయడంతోపాటు కొణిజర్ల మండలంలోని గ్రీన్ ల్యాండ్ డెవలపర్స్ ప్లాటు నెం. 6,8,108,134,135ను డబుల్ రిజిస్ట్రేషన్ చేశారనే ఫిర్యాదుమేరకు తెలంగాణ రాష్ట్ర రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ బుద్ధప్రకాశ్ ఈ నెల 10న ఇచ్చిన సస్పెన్షన్ ఉత్తర్వులు సంక్రాంతి సెలవుదినాల వలన ఆలస్యం అయ్యింది. 15వతేదీన వెలువడిన సస్పెన్షన్ ఉత్తర్వులు 16వ తేదీన వెలుగులోకి వచ్చాయి.

తెగని 'పంచాయతీ'

- మరుగునపడ్డ ఐదు పంచాయతీల విలీన సమస్య
- ఇరు రాష్ట్రాల అధికారుల సమావేశంలో చర్చకురాని అంశం
- ఆ ఐదు వస్తేనే భద్రాచలానికి భవిష్యత్తు



ఖమ్మం, జనవరి 16(ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్ర విభజన సమయంలో ఏపీలో కలిసిన తెలంగాణలోని భద్రాచలం మండలానికి చెందిన ఐదు పంచాయతీల విలీన సమస్య మరుగున పడింది. ఏపీలోని ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాలని దశాబ్దకాలంగా సాగుతున్న ప్రయత్నాల ఫలితంగా గత ఏడాది హైదరాబాద్‌లో జరిగిన ఆంధ్రా, తెలంగాణ ముఖ్యమంత్రుల సమావేశంలో ఈ అంశం చర్చకు రావడంతో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆశించారు. కానీ ఆ తరువాత అమరావతిలో జరిగిన రెండు రాష్ట్రాల ఉన్నతాధికారుల ఉమ్మడి సమావేశంలో దీనిపై చర్చకు రాకపోవడంతో ఈ సమస్య మళ్లీ మరుగున పడింది.

గత ఏడాది హైదరాబాదులో రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డిల మధ్య జరిగిన సమావేశంలో భద్రాచలాన్ని ఆనుకుని ఉన్న యటపాక, పురుషోత్తపట్నం, గుండాల, కన్నాయిగూడెం, పిచుకులపాడు పంచాయతీలను తెలంగాణలో కలపాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. అయితే రెండు రాష్ట్రాలకు సంబంధించిన విభజన సమస్యలపై ఉన్నతాధికారుల సమావేశంలో చర్చించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ఈ నేపథ్యంలోనే అమరావతిలో గతనెలలో రెండు రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన కార్యదర్శులతో పాటు పలువురు అధికారులు సమావేశం నిర్వహించి 15అంశాలపై సుదీర్ఘ చర్చ జరిపారు. రాష్ట్ర విభజనలోని ఉద్యోగుల సమస్య, వాణిజ్యపన్నులు, ఎక్సైజ్ నిధుల వివాదాలు, విద్యుత్ బకాయిలుతో పాటు పలు అంశాలపై చర్చించి కొన్ని సమస్యల పరిష్కారంపై పరస్పర అంగీకారానికి వచ్చారు. అయితే ఆ సమస్య అజెండాలో ఐదు పంచాయతీల సమస్య లేకపోవడంతో ఈ పంచాయతీల సమస్య పరిష్కారం అవుతుందా లేదా అన్నదానిపై సర్వత్రా చర్చ జరుగుతోంది.

భద్రాచలం పట్టణానికి రెండువైపులా గోదావరి, మరో రెండువైపులా ఆంధ్రా సరిహద్దు ఉండడడంతో పట్టణం విస్తరించలేకపోతోంది. భద్రాచలానికి చెందిన చెత్తాచెదారం వేయాలన్నా ఏపీలోని యటపాక, పురుషోత్తపట్నం పంచాయతీల్లో వేయాల్సి వస్తోంది. దీంతో ఐదు పంచాయతీలు సర్పంచ్‌లు తెలంగాణలోని భ ద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తమను కలపాలని అప్పటి గవర్నర్ తమిళిసైతో పాటు భద్రాచలం వచ్చిన రాష్ట్రపతి ద్రౌపదిముర్ముకు, సీఎం రేవంత్‌రెడ్డికి తీర్మాణాలు అందించారు. జిల్లాకు చెం దిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా ఈ ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాలని ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు విజ్ఞప్తిచేశారు. గతంలో ఇద్దరు ముఖ్యమంత్రుల సమావేశంలో ఈ అంశం చర్చకురావడంతో ఐదు పంచాయతీలు తెలంగాణకు వస్తాయని భద్రాద్రి ప్రాంత ప్రజలు ఆశలు పెంచుకున్నారు. కానీ ఆ తరువాత అమరావతిలో జరిగిన సమావేశంలో ఈ అంశంపై ఎలాంటి ప్రస్తావన రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణలో రప్పించేందుకు దృష్టి పెట్టడంలేదు. రెండు రాష్ట్రాల సరిహద్దున ఉన్న ఈ ఐదు పంచాయతీలు విలీనం మీదనే భద్రాచలం పట్టణ భవిష్యత్ ముడిపడి ఉంది.

రాష్ట్ర విభజనలో భద్రాచలం పట్టణం మినహా పక్కనే ఉన్న ఐదు గ్రామపంచాయతీలు ఏపీలో కలిపిన విషయం విధితమే. భద్రాచలం నుంచి పర్ణశాలకు వెళ్లాలంటే 9కిలోమీటర్లు ఆంధ్రాను దాటి మళ్లీ తెలంగాణలోకి వెళ్లాల్సి ఉంటుంది. దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు నాలుగు మండలాలు రాకపోకలకు ప్రతిరోజు ఏపీ ప్రాంతంలో ప్రయాణించి వెళ్లాలి. ఈ ఐదు పంచాయతీల ప్రజలు కూడా ఏ సమస్య వచ్చినా భద్రాచలంలోనే వారి జీవనం ముడిపడి ఉంటుంది. నిత్యావసరాలతో పాటు ఆసుపత్రులు, పిల్లల చదువులన్నీ భద్రాచలం కేద్రంగానే సాగుతున్నాయి. ఇప్పుడు ఆయా పంచాయతీలన్నీ ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో ఉన్నందున జిల్లా కేంద్రం వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. భద్రాచలం సీతారామచంద్రస్వామి భూములు కూడా పురుషోత్తపట్నంలో ఉండగా భద్రాచల రామాలయానికి అనుసంధానంగా ఉన్న జటాయువు ఆలయం యటపాక గ్రామంలో ఉంది.

మహిళలు నూతన ఆలోచనలతో రావాలి

- కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్



ఇందిరామహిళ శక్తి యూనిట్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

పెనుబల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన ఇందిర మహిళ శక్తి పథకాన్ని వినియోగించుకొని ఆర్థికంగా బలపడటమే కాకుండా నూతన ఆలోచనలతో మరి కొందరికి ఉపాధి ఆవకాశాలు కల్పించాలని కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ అన్నారు. గురువారం పెనుబల్లిలో మహిళ స్వయం సహాయక బృందాలకు బ్యాంకు లింకేజీతో ఏర్పాటు చేసుకున్న పలు యూనిట్ల దుకాణాలను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినూత్న ఆలోచనలతో వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకొనే మహిళలకు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. అనంతరం పెనుబల్లిలో కొప్పుల గౌరి కుట్టు మిషన్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో ఏపీడీ నూరుద్దిన్, ఎంపీడీవో అన్నపూర్ణ, తహసీల్దార్ గంటా ప్రసాద్, ఏపీఎం జ్యోతి, సీసీలు ప్రసాద్, చలమయ్య, మోహన్‌రావు, వెంకయ్య, విక్టర్‌పాల్, రాధిక తదితరులు పాల్గొన్నారు.

మైనర్లను పనిలో పెట్టుకున్న రెస్టారెంట్ యజమానిపై కేసు నమోదు

పాల్వంచ, జనవరి 16 ఆంధ్రజ్యోతి: మైనర్లను పనిలో పెట్టుకున్న రెస్టారెంట్ యజమానిపై పాల్వంచ టౌన్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఆపరేషన్ స్మైల్-11లో భాగంగా డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ సభ్యులు పాల్వంచ మెయిన్‌రోడ్డులో రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో నిర్మాణంలో ఉన్న ఓ రెస్టారెంట్ బిల్డింగ్‌లో మార్బుల్ వర్క్‌లో నిమగ్నమైన ముగ్గురు మైనర్లను గుర్తించారు. ఆ ముగ్గురు బాలురు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వారని, వారు ముగ్గురూ మైనర్లని అధికారులు నిర్ధారణకు వచ్చారు. దీంతో పాల్వంచ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో వారు ఫిర్యాదు చేయగా, సదరు రెస్టారెంట్ యజమాని శేషగిరిరావుపై కేసు నమోదు చేసినట్లు పాల్వంచ టౌన్ ఎస్ఐ సుమన్ తెలిపారు.

పైనంపల్లి టోల్‌ప్లాజా వద్ద ఏఆర్ కానిస్టేబుల్ వీరంగం..

నేలకొండపల్లి, జనవరి16(ఆంధ్రజ్యోతి): పైనంపల్లి టోల్‌ప్లాజా వద్ద సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన ఓ ఏఆర్ కానిస్టేబుల్ గురువారం వీరంగం సృష్టించాడు. టోల్ ఫీజు కట్టమన్నందుకు, ఎందుకు కట్టాలి, నేను ఏఆర్ కానిస్టేబుల్‌ను...నేను కూడా టోల్ ఫీజు కట్టాలా? అంటూ సిబ్బందిపై దూషణలకు దిగాడు. ఎమర్జెన్సీ లైన్‌లో దాదాపుగా 30 నిమిషాలకు పైగా కారును నిలిపి, కారు దిగి పక్కకు వెళ్లిపోయాడు. కారులో ఉన్న కుటుంబ సభ్యులు సైతం కానిస్టేబుల్‌కు మద్దతుగా నిలిచారు. ఎమర్జెన్సీ లైన్‌లో కారును నిలిపారు...పక్కకు తీయమని టోల్ సిబ్బంది చెప్పినా వినిపించుకోలేదు. దీంతో టోల్ సిబ్బంది నేలకొండపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఓకానిస్టేబుల్ వచ్చి చెప్పినప్పటికీ సదరు ఏఆర్ కానిస్టేబుల్ వినిపించుకోలేదు. పైగా వచ్చిన కానిస్టేబుల్‌పై కూడా పరుషంగా మాట్లాడినట్లు సమాచారం. పోలీస్‌స్టేషన్ నుంచి వచ్చిన కానిస్టేబుల్ ఏఆర్ కానిస్టేబుల్ ప్రవర్తనపై ఎస్ఐకు సమాచారం ఇవ్వగా, గమనించిన ఏఆర్ కానిస్టేబుల్ ఫాస్టాగ్ వేసుకుని వెళ్లిపోయినట్లుగా తెలుస్తున్నది.

'లక్ష డప్పులు, వేల గొంతులు' సభను జయప్రదం చేయాలి

- మందకృష్ణమాదిగ



సీడీని ఆవిష్కరిస్తున్న మందకృష్ణమాదిగ

ఖమ్మం చర్చికాంపౌండ్ , జనవరి 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న జరుప తలపెట్టిన 'లక్ష డప్పులు.. వేల గొంతుకలు' సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ గురువారం ఖమ్మంలో పిలుపునిచ్చారు. లక్షడప్పులు, వేల గొంతుకలు సభ జయప్రదం కోసం ఖమ్మంలో రూపొందించిన పాటల సీడీని ప్రజాగాయకుడు ఏపూరి సోమన్నతో కలిసి ఆవిష్కరించారు. మందకృష్ణ మాట్లాడుతూ న్యా యబద్ధమైన ఎస్సీ వర్గీకరణనుతక్షణం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ లక్షడప్పులు, వేల గొంతుకలు సభను నిర్వహించబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్ 7 స్టూడియో చైర్మన్ నందిగామ రాజ్ కుమార్, మ్యూజిక్ డైరెక్టర్ బొమ్మెర అరవింద్, రచయిత కొమ్ము రవి,తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

పినపాక, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కోడిపందేల స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. డీఎస్పీ రవీందర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏడుళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు సూచనలతో ఎస్ఐ రాజ్‌కుమార్, సిబ్బంది గురువారం టీ కొత్తగూడెం దగ్గర కోడిపందేలు ఆడుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 13 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని, 16 ద్విచక్ర వాహనాలు, ఆటో, రూ. 3,100ల, రెండు కోడి పుంజులు సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కి తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలి

కూసుమంచి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో ఈనెల 25 నుంచి రెండురోజుల పాటు జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని మండల కార్యదర్శి తోటకూరి రాజు తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తూ పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందన్నారు. సీపీఎంను ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లెల షన్మతిరావు, తాళ్లూరి వెంకటేశ్వర్లు,గన్యా, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌కార్డు జాబితాలో పేర్లు గల్లంతు!

- నాలుగు పథకాలపై సర్వే ప్రారంభం
- బృందాలుగా ఏర్పడిన అధికారులు
- సాగుకు యోగ్యంకాని భూముల పరిశీలన
- నేలకొండపల్లి మండలంలో సర్వే పరిశీలించిన అదనపు కలెక్టర్ శ్రీజ
- ప్రభుత్వం ఇచ్చిన జాబితా ప్రకారమే సర్వే చేస్తున్నామంటున్న అధికారులు

కూసుమంచి/నేలకొండపల్లి/ఖమ్మం సంక్షేమ విభాగం/తిరుమలాయపాలెం జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నాలుగు కొత్త పథకాలకు అర్హుల కోసం సర్వే ప్రారంభించింది. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను తీసుకురావడం ద్వారా ప్రజల అవసరాలు తీర్చేందుకు ముందుకు వచ్చింది. ఈక్రమంలో పథకాల లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి సర్వే ప్రక్రియ గురువారం ప్రారంభం అయింది. గ్రామాల్లో వ్యవసాయ, రెవెన్యూ, ఐకేపీ అధికారులు బృందాలుగా విడిపోయి సర్వే చేపట్టారు. తొలి రోజున ప్రశాంతంగా జరిగింది.

ఇదిలా ఉండగా ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించింది. అదేవిధంగా కులగణన సమయంలోనూ అవసరమైన వారి పేర్లు నమోదు చేసుకున్నారు. అయితే గురువారం సర్వే ప్రక్రియ పారరంభించే సమయంలో ప్రభుత్వం జాబితాను అందించింది. కానీ అందు లో చాలా మంది దరఖాస్తుదారుల పేర్లు గల్లంతయ్యాయి. పదేళ్లుగా రేషన్‌కార్డులను మంజూ రీ చేయలేదు. దీంతో పెద్దసంఖ్యలో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఒక్కో గ్రామానికి 40-50 మాత్రమే జాబితాలో పేర్లు వచ్చాయి. పెద్దసంఖ్యలో పేర్లు గల్లంతుకావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలం మొత్తం మీద 1488 మందితో కూడిన జాబితా మాత్రమే అందించడంతో వారిని మాత్రమే అధికారులు సర్వే చేస్తున్నారు. తొలిరోజున 216మందిని సర్వే చేసినట్లు ఎంపీడీవో వేణుగోపాలరెడ్డి తెలిపారు.

ఈవిషయమై ఎంపీడీవో వేణుగోపాలరెడ్డిని వివరణ కోరగా తమకు ప్రభుత్వం నుంచి వచ్చిన జాబితాపైనే సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలో తాము కూడా దరఖాస్తు చేసుకున్నామని దృష్టికి తీసుకొవస్తున్నారని తెలిపారు. జాబితాలో పేర్లమిస్సింగ్‌పై తమవద్ద సమాచారం లేదన్నారు.

రైతుభరోసాపై సర్వే

మండలంలో జీళ్లచెరువు, కూసుమంచి, పాలేరు, నాయకన్‌గూడెం, జుజ్జులరావుపేట గ్రామాల్లో రెవెన్యూ అధికారులు సాగు భూముల సర్వే చేపట్టగా.. అందులో వెంచర్లకు, గుట్టలకు రైతుబంధు పెద్దఎత్తున వస్తున్నట్లుగా గుర్తించారు. వాటన్నింటినీ గుర్తించి తొలగించే ప్రక్రియ చేపట్టారు. నాలుగు రోజుల అనంతరం సర్వేలో తొలగించిన భూముల వివరాలనుగ్రామ సభలో ప్రకటించనున్నట్లు తహసీల్దార్ కరుణశ్రీ తెలిపారు. స్వయంగా రియల్ భూములను పరిశీలించి తొలగిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఒకవేళ తప్పులు దొర్లినా సరిచేస్తామని తెలిపారు.

అదేవిధంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 20రోజుల ఉపాధిపనికి వెళ్లిన వారిని గుర్తించి ప్రభుత్వానికి పంపిస్తున్నట్లు తెలిపారు. నాలుగు పథకాలపై పారదర్శకంగా సర్వేనిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్

నేలకొండపల్లి, (ఆంధ్రజ్యోతి): రైతు భరోసాకు సంబంధించి ప్రభుత్వం చేపట్టిన సాగుకు యోగ్యంగాని భూములు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల సర్వేను గురువారం అదనపు కలెక్టర్ శ్రీజ నేలకొండపల్లిలో పరిశీలించారు. రెవెన్యూ, వ్యవసాయాధికారులు గురువారం నుంచి భూ ముల సర్వేను చేపట్టారు. మండల వ్యాప్తంగా గురువారం దాదాపుగా 200 ఎకరాలను వ్యవసాయానికి యోగ్యంగాని భూములను అధికారులు గుర్తించినట్లుగా సమాచారం. అందులో ఓ పవర్‌ప్లాంట్‌కు సంబంధించి ప్రస్తుతానికి 20ఎకరాలు, చెర్వుమాధారానికి చెందిన ఓ క్వారీకి చెందిన దాదాపుగా 50 ఎకరాలున్నట్లుగా తెలుస్తున్నది. ఇంకా కొన్ని క్వారీల భూములను సైతం గుర్తించినట్లుగా తెలుస్తున్నది. సర్వేను ఖచ్చితంగా చేయాలని, ఎటువంటి పొరపాట్లకు తావివ్వవద్దని అదనపు కలెక్టర్ సర్వే బృందాన్నిఆదేశించారు. అదే సమయంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను శుక్రవారం కల్లా పూర్తి చేయాలన్నారు. రేషన్ కార్డులకు అర్హులను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. సర్వేను ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ జాదవ్ మాణిక్యం, ఎంపీడీవో యర్రయ్య, మండల ప్రత్యేకాధికారి రవికుమార్, వ్యవసాయాధికారి రాధ, ఎంపీవో శివ, ఏఈఓలు అరవింద్, భవాని, కార్యదర్శి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

తొలిరోజు ఊపందుకున్న రేషన్‌కార్డుల సర్వే

ఖమ్మం సంక్షేమ విభాగం(ఆంధ్రజ్యోతి) కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సర్వే ప్రక్రియ ఖమ్మం నగర పాలక సంస్థలో తొలి రోజే ఊపందుకొంది. ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో మొత్తం 5,295 దరఖాస్తులకు గాను గురువారం ఖమ్మంలోని 60 డివిజన్లలో 60 బృందాలు క్షేత్రస్థాయిలో 33 మంది వార్డు అఫీసర్లు, కార్యాలయం ఉద్యోగులు 27 మంది, మెప్మా ఆర్పీలు 100 మంది కలిసి 1,627 దరఖాస్తులను పరిశీలన చేశారు. క్షేత్రస్థాయిలో రేషన్‌కార్డుల దరఖాస్తుల పరిశీలనలో మెప్మా పరిధిలోని సీవోలు, ఆర్పీలు కీలకంగా పనిచేయటంతో దరఖాస్తుదారుల చిరునామాలను వార్డు ఆఫీసర్లు, ఇతర అధికారులు తెలిగ్గా చేరుకోగలిగారు. ఒక వైపు ఇందిరమ్మ ఇళ్ల చివరి దశలో సర్వేను చేస్తూనే 30.75శాతం కొత్త రేషన్‌కార్డుల సర్వే పూర్తి చేయటంపై కేఎంసీ అధికారులు సర్వే బృందాలను అభినందించారు.



ఖమ్మంలో సర్వే చేస్తున్న రెవెన్యూ, మెప్మా బృందాలు

రైతుభరోసాపై సర్వే

తిరుమలాయపాలెం (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో సాగుకు యోగ్యంకాని భూములను తహసీల్దార్ వీవీ రామకృష్ణ ఆధ్వర్యంలో సర్వేచేపట్టారు. మండలంలోని దమ్మాయిగూడెం, తెట్టెలపాడు, తిరుమలాయపాలెం, కొక్కిరేణి, తదితరగ గ్రామాల్లో సాగుకు యోగ్యం కాని భూములను సర్వేచేశారు. ఆయా గ్రామాల్లో పలు రైతులకు చెందిన సాగుకు యోగ్యంకాని భూములను సర్వేచేపట్టి వివరాలు సేకరించారు. గ్రానైట్ భూములు, వెంచర్లకు సంబంధించిన భూముల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఏవో సీతారాంరెడ్డి, ఆర్ఐ వీరయ్య పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ భరోసా, రేషన్‌కార్డుల సర్వే కూడా మండలంలో కొనసాగుతుందని అధికారులు తెలిపారు.



కూసుమంచి మండలం జీళ్లచెరువులో సర్వేను పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ కరుణశ్రీ



ఖమ్మంలో సర్వే నిర్వహిస్తున్న మెప్మాలు

రైతుబజార్ కూరగాయల ధరలు

కూరగాయలు ధరలు
(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	20రూ.
వంకాయ	38
గుత్తి వంకాయ	48
బీరకాయ	38
పచ్చిమిర్చి	44
కాకరకాయ	58
బెండకాయ	34
పొట్లకాయ	48
దోసకాయ	44-48
నాటుచిక్కుడు	110
గోరుచిక్కుడు	54
క్యాబేజీ	24
దొండ	64-68
సొరకాయ	20
క్యారెట్	48
క్యాప్సికం	58
అలుగడ్డ	36
ఉల్లిగడ్డ	40-45
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	160
కొత్తిమీర కట్ట	20

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

CINEMA సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	గేమ్ చేంజర్
శ్రీనివాస:	డాకు మహరాజ్
సాయిరాం:	డాకు మహరాజ్
కేపీఎస్:	గేమ్ చేంజర్
తిరుమల:	సంక్రాంతికి వస్తున్నాం
సినీగెలాక్సీ:	యూఐ

అలరించిన కవి సమ్మేళనం

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా తెలుగు ఫోరమ్ ఆధ్వర్యంలో ఖమ్మంలోని రిక్కాబజార్ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన కవిసమ్మేళనం కవిత్వాభిమానులను అలరించింది. వర్తమాన, సామాజిక అంశాలపై కవులు తమ కవితలను చదివి వినిపించారు. తెలుగు ఫోరమ్ అధ్యక్ష కార్యదర్శులు యనగంధుల దేవయ్య, జీడీఎస్‌వీ రమణ కవులను నగదు బహుమతితో పాటు శాలువాలతో సన్మానించారు.

2న 'కలికితురాయి' ఆవిష్కరణ

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): 'కలికితురాయి' కవిత్వ పుస్తక ఆవిష్కరణ జాషువా సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న ఖమ్మం వీడీవోస్ కాలనీలోని సర్వజ్ఞ స్కూల్‌లో సాయంత్రం 6 గంటలకు జరుగనుంది. గరిడేపల్లి శోభనాద్రి రచించిన ఈ పుస్తకాన్ని నామా రామారావు ఆవిష్కరిస్తారు. జాషువా సాహిత్య వేదిక బాధ్యుడు పగిడిపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగే సభలో పలువురు కవులు పాల్గొననున్నారు.

కాంగ్రెస్‌నేతకు నివాళులు

తిరుమలాయపాలెం జనవరి16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిదపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ముదిరెడ్డి శేషిరెడ్డికి వివిధ పార్టీల నేతలు గురువారం ఘన నివాళులర్పించారు. ఆయన అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా గురువారం దశ దినకర్మ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి వివిధపార్టీల నేతల పూలమాలలువేసి నివాళులర్పించారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ముదిరెడ్డి మల్లారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, నూకల రంగారెడ్డి, పాల్గొన్నారు.

కూసుమంచి శివాలయంలో శివదీక్షలు ప్రారంభం



శివ దీక్షలు తీసుకున్న భక్తులు

కూసుమంచి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): కూసుమంచిలోని ప్రసిద్ధ శైవక్షేత్రం శివాలయంలో శివదీక్షలు ప్రారంభం అయ్యాయి. శివస్వాముల ఓం నమఃశివాయ నామస్మరణతో ఆలయం మార్మోగింది. ఆలయంలోని అభిషేకమండపంలో ఆలయ ప్రధాన అర్చకులు శేషగిరి శర్మ, గురుస్వాములు చెన్న మోహన్, వడిత్య దేవా, శ్రీను ఆధ్వర్యంలో 101 మంది శివభక్తులు శివుడి మల ధరించారు. ప్రతి యేట శివరాత్రి 41 రోజులకు ముందు మాలాధారణ చేసి లింగోద్భవ సమయంలో మాల విరమణ చేస్తారు. 15సంవత్సరాలుగా ప్రతి ఏట పెద్దసంఖ్యలో మాలధారణ వేసుకోవడం ఆయవాయితీగా వస్తోంది. మానవుడు భగవత్ దీక్ష కలిగిఉంటే అరిష్టాలు తొలిగి సిరిసంపదలు, సుఖసంతోషాలు కలుగుతాయని నమ్మకం. దీక్షల్లో అత్యుత్తమమైంది శివదీక్ష. లయకారుడైన శివుని రూపం ధరిస్తే మోక్షం కలుగుతుందని నమ్మకం. అందుకే భోళాశంకరుడైన మహాశివుని భక్తులు కొలుస్తారు.

సంజయ్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాస్‌లైన్ నాయకులు

ఖమ్మం రూరల్ జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి పంచాయతీ రాజీవ్‌గృహకల్ప ఏరియాలో సాగర్ కాలువలో శవమై కనిపించిన సంజయ్‌కుమార్ మృతిపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యు లు ఆవుల అశోక్, బందెల వెంకయ్య డిమాం డ్ చేశారు. గురువారం రాజీవ్‌గృహకల్పలో మృతుడి ఇంటికి వెళ్లి సంజయ్ తల్లిదండ్రులను పరామర్శించారు. వారు మాట్లాడుతూ ఎన్నెస్పీ కాలవకట్ట అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని, గంజాయి, మద్యం తదితర మత్తు పానియాలకు వివిధ ప్రాంతాలనుంచి వచ్చి ఇక్కడ సేవించడం లాంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని, వీదిలైట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని వారు కోరారు. సంజయ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకో వాలని కోరారు. పార్టీ జిల్లా నాయకులు మలీ దు నాగేశ్వరరావు, టి.ఝాన్సీ, కె.శ్రీను, శోభ, జాన్సీన్ శారద రామారావు, పుల్లారావు, యాకోబ్, అనంత నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, శిక్షణ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ గురువారం ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమములో జిల్లా గౌరవ అధ్యక్షుడు వి. వెంకన్న, జిల్లా అధ్యక్షుడు జి.బిక్కు, పి.వెంకటరమణ, అజ్మత్ బేగ్, కృష్ణయ్య, నగర అధ్యక్షులు ఆర్. వెంకటేశ్వరావు, టి.వెంకటేశ్వర్లు, సీతారాములు, గిరిజకుమారి, అంజమ్మ, అరుణ, విజయ, కృష్ణ, సీత, ప్రచార కార్యదర్శి చావా నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

తిరుమలాయపాలెం జనవరి16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రఘునాథపాలెం గ్రామానికి చెందిన అంగడి నాగమణి సుబ్లేడు గ్రామీణ వికాస్‌బ్యాంకులో ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన కింద రూ.436 చెల్లించి ఇన్సూరెన్స్ పొందింది. ఆమె ఇటీవల మృతిచెందగా ఆమెకు రూ2లక్షలు బీమా బాండు మంజూరుకాగా వాటిని మేనేజర్ ఎస్‌కే మున్నా నాగమణి కుమారుడు కార్తీక్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో సీసీ దేవసుందరం, కామళ్ల లలిత, రాంబాబు, పాల్గొన్నారు.

సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలి

ఖమ్మం రూరల్ జనవరి 16 (ఆధ్రజ్యోతి): ఆంధ్రాబ్యాంక్ కర్షక సేవా సహకారసంఘం టేకులపల్లి బ్యాంక్ కింద ఉన్న ఖమ్మం రూరల్ మండలంలోని పలు గ్రామాలను విడదీసి నూతనంగా మద్దులపల్లి సహకారసంఘంగా ఏర్పాటుచేయాలని బ్యాంక్ డైరెక్టర్ రావెళ్ల కిషన్, కాంగ్రెస్ నాయకులు అంబటి సుబ్బారావు, తమ్మినేని నవీన్ జిల్లా అధికారులను కోరారు. గురువారం పలుగ్రామాల రైతులతో సంబంధిత అధికారి డీసీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏటుకూరి సుధాకర్, వేగినాటి రంగారావు, గురునారాయణ, అంజయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జీళ్లచెరువులో పూర్వవిద్యార్థుల సమ్మేళనం



కూసుమంచి, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీళ్లచెరువు ఉన్నత పాఠశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1998-99లో పదోతరగతి చదివి వివిధ రంగాల్లో స్థిరపడిన విద్యార్థులందరూ గురువారం సమావేశం అయ్యారు. గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు రాజయ్య, సీతారాం తదితరులను సత్కరించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న రవాణాశాఖ అధికారులు

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వాహనాలను నడిపే ప్రతీ ఒక్కరూ తప్పనిసరిగా రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలని, హెల్మెట్, సీటు బెల్ట్ మాత్రమే రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కాపాడతాయని జిల్లా రవాణాశాఖ ఏఎంవీఐలు గోపికృష్ణ, రవిచందర్ సుమలత వాహనదారులకు అవగాహన కల్పించారు. గురువారం ఖమ్మం నగరంలోని ప్రధాన రహదారులపై వాహనదారులకు రోడ్డు భద్రతా మసోత్సవాలపై అవగాహన కల్పించారు. డ్రైవర్లుతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. లైసెన్స్‌లను పరిశీలించి రెన్యూవల్స్ చేయించుకోవాలని సూచించారు.

రేపటినుంచి న్యాయవాదులకు క్రీడా పోటీలు

ఖమ్మం లీగల్ జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం కోర్టులో జనవరి 26ను పురస్కరించుకొని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు క్రీడా పోటీలను శనివారం నుంచి 24 వరకు నిర్వహిస్తున్నట్టుగ ఖమ్మం బార్ అసోసియేషన్ క్రీడల కార్యదర్శి ఏ.యుగంధర్ తెలిపారు. 18న చెస్, 19న క్రికెట్, 20న షటిల్, 21న వాలీబాల్, 22న అథ్లెటిక్స్, 23న కబాడీ పోటీలు, 24న పాటల పోటీలను నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

కార్మికుల సమస్యలపై ఉద్యమబాట



మాట్లాడుతున్న టీయూసీఐ రాష్ట్ర కార్యదర్శి రామయ్య

ఖమ్మం సంక్షేమ విభాగం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలు, హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని, ప్రభుత్వ సంస్థలు, కార్పొరేషన్‌లు కార్పొరేటీకరణ చేస్తూ పరోక్షంగా కార్మికుల కుటుంబాలను వీదిన పడేస్తున్నాయని కార్మికుల సమస్యలపై ఉద్యమబాట కోసమే టీయూసీఐ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ద్వితీయ మహాసభలను నిర్వహిస్తున్నామని సంఘం రాష్ట్ర కార్యదర్శి జీ రామయ్య పేర్కొన్నారు. గురువారం ఖమ్మంలో నిర్వహించిన ప్రచార ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఈనెల 19న మహబూబాబాద్‌లో రాష్ట్ర మహాసభలు జరుగుతాయని వివరించారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానాలను రద్దు చేసి పర్మినెంట్‌గా కార్మికులను గుర్తించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మహాసభలను ప్రారంభిస్తారని కార్మికుల సమస్యలపై తీర్మాణాలు చేసి అమోదించటం జరుగుతుందన్నారు. నాయకులు కొయ్యల శ్రీనివాస్, దున్న గురవయ్య, షల్లయ్య, రవి, జానీ, వెంకన్న, నారాయణ, నరసయ్య, అనిల్, రాజు, రాధమ్మ పాల్గొన్నారు.

మార్కెట్‌ను సందర్శించిన నాయకులు



దగ్ధమైన పత్తిని పరిశీలిస్తున్న సీపీఎం బృందం

ఖమ్మం మార్కెట్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌ను గురువారం సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సందర్శించారు. బుధవారం రాత్రి పత్తి మార్కెట్ యార్డులలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న నేపధ్యంలో ప్రమాదానికి గురై కాలిపోయిన పత్తిని వారు పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రా శ్రీకాంత్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం: ఏఐయూకేఎస్

మార్కెట్ కమిటీ అధికారుల నిర్లక్ష్యం వల్లే పత్తి యార్డులో అగ్ని ప్రమాదం జరిగిందని అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయూకేఎస్) రాష్ట్ర నాయకులు ఆరోపించారు. గురువారం మార్కెట్‌లో అగ్ని ప్రమాదానికి గురై కాలిపోయిన పత్తిని వారు పరిశీలించారు. మార్కెట్‌లో వెంటనే ఫైరింజన్‌ను ఏర్పాటు చేసి సెక్యూరిటీని పటిష్టం చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, కోలేటి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ శ్వేత పరిశీలన

పత్తి మార్కెట్ యార్డులో అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న నేపధ్యంలో ప్రమాదానికి గురై కాలిపోయిన పత్తిని ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత పరిశీలించారు. యార్డులలో ప్రమాద నివారణకు మార్కెట్ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని సూచించారు.



ఆంధ్రజ్యోతి
● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి
8
ZONE
శుక్రవారం 17 జనవరి 2025
వైరా-మధిర
సత్తుపల్లి
WYRA, MADHIRA, SATHUPALLY

బాధిత కుటుంబాలకు మంత్రి తుమ్మల పరామర్శ



మంత్రి తుమ్మలను కలసిన అభిమానులు

కల్లూరు, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు గ్రామాల్లోని నాయకులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. లింగాల గ్రామంలో సీపీఎం సీనియర్ నాయకుడు మట్టూరి భద్రయ్య, టీడీపీ సీనియర్ నాయకుడు కట్టా పుల్లయ్య, వైబీపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ నాయకుడు అప్పారావు మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం చంద్రుపట్లలో మాజీ సర్పంచ్ వల్లపునేని భద్రయ్యను మంత్రి తుమ్మల కలిసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు, లక్కినేని కృష్ణ, మాదాల గోపాలరావు, ఏనుగు సత్యం బాబు, దేవరపల్లి వెంకటేశ్వరరావు, పోట్రు సత్యం, కలకొడిమ సహకార సంఘం అధ్యక్షుడు దిరిశాల నరిసింహారావు ఉన్నారు.

సత్తుపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా, నాడు ఏపీ ఉమ్మడి రాష్ట్రంలో మీరు మంత్రిగా ఉన్నప్పుడు మా గ్రామాలకు బీటీ రహదారులు, తాగునీటి పథకాలు వంటి మౌలిక వసతులు కల్పన మీతోనే సాధ్యమైందని నాటిజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నా రు.

మండల పరిధిలోని చంద్రుపట్ల గ్రామంలోని హెల్త్ సెంటర్‌ను చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి విడదిసి కల్లూరు ఆసుపత్రిలో సేవలు అందించేలా విలీనం చేయాలని, చెన్నూరు పీఏసీఎస్ నుంచి చంద్రుపట్లను విభజించి ప్రత్యేకంగా చంద్రుపట్లను సహకార సంఘంగా ఏర్పాటు చేయాలని, స్థానికంగా ప్రభుత్వ పాఠశాలలో అదనపు గదులకు నూతన భవనాలను నిర్మించాలని మంత్రి తుమ్మలను స్థానికంగా మాజీ సర్పంచ్ వల్లపునేని భద్రయ్యతో పాటుగా పలువురు కోరారు. దీనిపై స్పందించిన మంత్రి తుమ్మల ఎమ్మెల్యే మట్టా రాగమయితో సంప్రందించిన తర్వాత సంబంధింత శాఖల జిల్లా అధికారులకు వాటిపై చర్యలు తీసుకోవాలని ఫోన్ ద్వారా ఆదేశించారు.

టీటీడీ బోర్డు సభ్యుడు నర్సిరెడ్డికి సన్మానం



నర్సిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

బోనకల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రావినూతల గ్రామంలో గురువారం టీటీడీ బోర్డు సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి, టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులును మండల టీడీపీ నాయకులు సన్మానించారు. పార్టీ బలోపేతం గురించి నాయకులతో చర్చించారు. సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ, నాయకులు షైనేని రవికుమార్, నందమూడి సత్యనారాయణ, షేక్ బాజీ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంక్

- పెచ్చులూడుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- మరమ్మతులు చేపట్టాలని వినతి

తల్లాడ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం మల్లవరం గ్రామంలోని గ్రామీణ తాగునీటి సరఫరా పథకం వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరి కూలే దశలో ఉంది. ఎప్పుడు కూలుతుందో తెలియని భయానక పరిస్థితి నెలకొంది. 30ఏళ్ల క్రితం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద లక్ష లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్‌ట్యాంకును నిర్మించారు. నిత్యం మూడు బోర్ల నుంచి విద్యుత్ మోటర్ల ద్వారా నీటితో ట్యాంకును నింపి తిరిగి ట్యాంకు నుంచి పైపులైన్ల ద్వారా ఇంటింటికి తాగునీటి సరఫరా చేయడం జరుగుతుంది. ప్రస్తుతం వాటర్ ట్యాంకు మెట్లు ధ్వంసమయ్యాయి. పిల్లర్లు, ట్యాంకు స్లాబ్ పగుళ్లు వచ్చి పెచ్చులూడుతున్నాయి. ట్యాంకు చుట్టూ నిర్మించిన గోడలు కూలిపోతున్నాయి. శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకు నుంచే ఇప్పటికీ నీటి సరఫరా జరుగుతుంది. వాటర్ ట్యాంక్ శిథిలావస్థకు చేరిందని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కూలే దశ లో ఉన్న వాటర్‌ట్యాంకుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ఇనుపచువ్వలు కనిపిస్తున్న దృశ్యం

మరమ్మతులు చేపట్టాలి

• కటికి వెంకటేశ్వర్లు, మల్లవరం



మల్లవరంలోని ప్రధాన వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉంది. శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంకుకు సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత మరమ్మతులు చేపట్టాలి.

ఇందిరాడైరీ సభ్యత్వ నమోదును త్వరగా పూర్తి చేయాలి

» డీఆర్‌డీవో సన్యాసయ్య

చింతకాని, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతి మహిళకు ఇందిరా డైరీ సభ్యత్వ నమోదు పూర్తి చేయాలని డీఆర్డీవో సన్యాసయ్య అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సెర్ప్, ఈజీఎస్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం జగన్నాథపురం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరాడైరీ బల్క్‌మిల్క్ చిల్లింగ్ పాయింట్ నిర్మాణ పనులను పరిశీలించారు. నాగులవంచ గ్రామంలో ఏర్పాటు చేసిన స్త్రీ టీ స్టాల్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసరావు, ఏపీవో కోటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

బోనకల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): పశువుల షెడ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని డీఆర్‌డీవో సన్యాసయ్య ఆదేశించారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఐకేపీ, ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 38 యూనిట్లు గుర్తించడంతో వాటిని వెంటనే ప్రారంభించేలా కృషి చేయాలని సూచించారు. ఐకేపీ చేయూతతో ప్రారంభించిన స్త్రీ శక్తి టీ స్టాల్‌ను డీఆర్‌డీవో పరిశీలించారు. ఈ సమావేశంలో డీపీఎం లక్ష్మణ్, ఏపీఎం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



స్త్రీ టీస్టాల్‌ను పరిశీలిస్తున్న డీఆర్డీవో సన్యాసయ్య

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలి

» అడిషనల్ కలెక్టర్ డాక్టర్ శ్రీజ

చింతకాని, జనవరి 16(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని అడిషనల్ కలెక్టర్ డాక్టర్ శ్రీజ అన్నారు. గురువారం చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వే, రేషన్‌కార్డు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సర్వే తీరును ఆమె పరిశీలించారు. ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా లబ్ధిదారులను గుర్తించాలని, సర్వే పారదర్శకంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ నెల 26 నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల గుర్తింపులో ఎటువంటి రాజకీయ జోక్యం ఉండొద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కూరపాటి అనంత రాజు, పంచాయతీ కార్యదర్శి శేఖర్, ఏఈవోలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్రీజ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

పథకాల సర్వేలో పారదర్శకత పాటించాలి

» వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా జనవరి 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి అమలు చేయబోతున్న సంక్షేమ పథకాల సర్వే అమలులో పారదర్శకత పాటించాలని వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ స్పష్టం చేశారు. గురువారం వైరాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో నాలుగు సంక్షేమ పథకాల సర్వే అమలు తీరుతెన్నులపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే ప్రసంగించారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు, కృష్ణమోహన్, ఖమ్మం డీఎస్‌వో చందన్‌కుమార్, డీఎస్‌పీవో రాంబాబు, ఖమ్మం పీఆర్ ఈఈ వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన శ్మశాన వాటిక సర్వే



సర్వే చేస్తున్న అధికారులు

మధిరటౌన్, జనవరి16(ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో ఇటీవల అక్రమ రిజిస్ట్రేషన్ అయిన హిందూ శ్మశాన వాటిక స్థలాన్ని గురువారం అధికారులు సర్వే చేపట్టారు. మధిర పట్టణంలో శివాలయం ప్రక్కన సర్వే నెంబర్ 424 లో గల 10ఎకరాల 24 కుంటల హిందూ శ్మశాన వాటిక స్థలాన్ని అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో సర్వే చేపట్టారు. శ్మశాన వాటికకు అనుకొని ఉన్న కొందరు 2,783 గజాల స్థలాన్ని అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ విషయాన్ని ఆంధ్రజ్యోతి వెలుగులోకి తీసుకురావడంతో విషయం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టికి వెళ్లింది. ఆయన పూర్తి స్థాయిలో సర్వే చేయాలని జిల్లా అధికారులను ఆదేశించడంతో సర్వే చేపట్టారు. శ్మశాన వాటికకు ఆనుకొని ఉన్న వారందరికీ వారం క్రితం అధికారులు నోటీసులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాంబాబు, మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్, జిల్లా సర్వేయర్ వెంకట్రావు, మండల సర్వేయర్ ఉషారాణి, ఆర్ఐ భాను ప్రసాద్, బెజవాడ రవి, కను మూరి వెంకటేశ్వరావు, కౌన్సిలర్లు మల్లాది వాసు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించండి: డీఈవో



మాట్లాడుతున్న డీఈవో సోమశేఖరశర్మ

వైరా, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలను పంపించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు డీఈవో సోమశేఖరశర్మ కోరారు. గురువారం వైరా మండలంలోని నారపునేనిపల్లి గ్రామాన్ని సందర్శించారు. పాఠశాల వయస్సు కలిగిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను కలిసి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వర్లు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దు

» డీఎంహెచ్‌వో కళావతిబాయి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

సత్తుపల్లిరూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్లి డబ్బు వృథా చేసుకోవడంతో పాటు ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దని డీఎంహెచ్‌వో డాక్టర్ బీ.కళావతిబాయి కోరారు. గురువారం సత్తుపల్లిలోని సీహెచ్‌సీ, ఆయుష్, గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టీ.సీతారామ్, డీపీవో దుర్గ, గంగారం పీహెచ్‌సీ వైద్యులు ఏ.అవినాష్, పీ.స్పందన, సిబ్బంది పాల్గొన్నారు.

మోతాదుకు మించి యూరియా వాడొద్దు

» జేడీఏ ధనసరి పుల్లయ్య



రికార్డులు పరిశీలిస్తున్న జేడీఏ

చింతకాని, జనవరి16(ఆంధ్రజ్యోతి): యాసంగి పంటలకు రైతులకు సరిపడా యూరియాను అందిస్తున్నామని జేడీఏ ధనసరి పుల్లయ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని చింతకాని, నాగులవంచ సొసైటీలను ఆయన పరిశీలించారు. జిల్లాలో యూరియా కొరత లేదన్నారు. రైతులు పంటలకు మోతాదుకు మించి ఎరువులు వాడొద్దని సూచించారు. కార్యక్రమంలో ఏవో మానస, చైర్మన్ నల్లమోతు శేషగిరిరావు, చింతకాని సీఈవో మారగాని శ్రీనివాసరావు, ఏఈవోలు పాల్గొన్నారు.

రైతు భరోసా సర్వే ప్రారంభం

కల్లూరు/తల్లాడ, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): కల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో గల పలు మండలాల్లో నాలుగు పథకాల లబ్ధిదారులను గుర్తించే క్రమంలో మండలాల స్థాయిలో అధికార బృందాలు క్షేత్ర స్థాయి లో సర్వే ప్రారంభించారు. సర్వేను కల్లూరు ఆర్డీవో ఎల్. రాజేంద్రగౌడ్ సందర్శించి పరిశీలించారు. సర్వేలో త హసీల్దార్ సాంబశివుడు, ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూ టీ తహసిల్దార్ బాబీప్రసాద్ తదితరులు ఉన్నారు.



బత్తులపల్లిలో రైతు భరోసా సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేంద్రగౌడ్

మధిరటౌన్‌లో..

మదిరటౌన్, జనవరి16(ఆంధ్రజ్యోతి): మధిర నియోజకవర్గంలో వ్యవసాయ భూములుగా రైతు భరోసా పొందుతున్న వ్యవసాయేతర భూములను గుర్తించే కార్యక్రమాన్ని అధికారులు గురువారం చేపట్టారు. చిం తకాని మండలంలో 30 ఎకరాలు, ముదిగొండ మండలంలో 14 ఎకరాలు, బోనకల్ మండలంలో 40 ఎకరాలు, మధిర మండలంలో 15 ఎకరాలు, ఎర్రుపాలెం మండలంలో 60 ఎకరాల వ్యవసాయేతర భూములను గుర్తించారు. మధిర నియోజకవర్గంలో మొత్తం 159 ఎకరాలను గుర్తించారు.

సత్తుపల్లిలో..

సత్తుపల్లి, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలంలో రైతు భరోసా సర్వేను అధికారులు ప్రారంభించారు. సర్వేను సత్తుపల్లి తహసీల్దార్ కే.యోగేశ్వరరావు, వ్యవసాయ అధికారి వై.శ్రీనివాసరావులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

కొణిజర్లలో..

కొణిజర్ల, జనవరి16(ఆంధ్రజ్యోతి): మండలంలో మొదటి రోజు రైతు భరోసా సర్వేను ప్రారంభించారు. మొదటి రోజు గుబ్బగుర్తి ప్రాంతంలో, మునగాల ప్రాంతంలో సర్వే చేశారు.

ఎర్రుపాలెంలో..

ఎర్రుపాలెం, జనవరి16(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతు భరోసా సర్వేను అధికారులు చేపట్టారు. మండలంలో 24 రెవెన్యూ గ్రామాలను 4విభాగాలుగా విభజించి వ్యవసాయేతర భూములను గుర్తించి జాబితాను సిద్ధం చేస్తున్నట్టు తహసీల్దార్ ఉషాశారద, ఏవో సాయి శివ తెలిపారు.

సత్తుపల్లిరూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మునిసిపాలిటీలో రేషన్‌కార్డుల సర్వే గురువారం నుంచి ప్రారంభమైంది. ఈనెల 25వ తేదీ వరకు సాగనున్న ఈ సర్వే పట్టణంలోని 23వార్డులలో 23మంది అధికారులతో నిర్వహిస్తున్నట్లు కమీషనర్ మందా రవి బాబు తెలిపారు.



గౌరిగూడెంలో వెంచర్‌ను పరిశీలిస్తున్న అధికారులు



ఎర్రుపాలెంలో..

'అబ్బూరి సర్కిల్ పేరు తొలగించడం సరికాదు'

మధిర రూరల్, జనవరి 16(ఆంధ్రజ్యోతి): మధిర మండలం ఆత్కూరు గ్రామంలో నాలుగు కూడళ్ల వద్ద సర్కిల్‌కు పెట్టిన మాజీ సర్పంచ్ అబ్బూరి పేరును గురువారం అధికారులు తొలగించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఆత్కూర్ సర్కిల్ కు అబ్బూరి సర్కిల్ అని పేరు పెట్టారని, ఈ పేరును తొలగించాలని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆర్‌అండ్‌బీ అధికారులుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్‌అండ్‌బీ, పోలీస్ అధికారులు తమ సిబ్బందితో కలిసి గురువారం ఆత్కూర్ కూడలిలో ఏర్పాటు చేసిన అబ్బూరి పేరుతో ఉన్న సర్కిల్ బోర్డును తొలగించారు. దీంతో విషయం తెలుసుకున్న ఆ గ్రామస్థులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు. దివంగత మాజీ సర్పంచ్ అబ్బూరి రామకృష్ణ కుటుంబం ఆత్కూరు గ్రామ అభివృద్ధికి కృషి చేశారని, పేదలకు అండగా ఉన్నారని, అలాంటి ఇంటివారి పేరును సర్కిల్‌కు పెట్టడం తప్పులేదని, పేరును తొలగించడం సరైన నిర్ణయం కాదని గ్రామస్థుల ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసనగా ఆత్కూరు గ్రామములో బోర్డు తొలగించిన చోట ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. నిరసనలో మాజీ సర్పంచ్ అబ్బూరి సంధ్యారాణి, అబ్బూరి రామన్‌తో పాటు బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దృశ్యం

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సత్తుపల్లిరూరల్, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కిష్టారం జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం 1999-2000బ్యాచ్ ఎస్ఎస్‌సీ పూ ర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. పదో తరగతి వరకు చదివి న విద్యార్థులు 25ఏళ్ల తర్వాత ఒక్కచోట కలుసుకుని ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకున్నారు. పాఠాలు చెప్పిన గురువులు సలీమ్, అనంతాచార్యులు, శ్రీనివాస్‌లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మధిరలో..

మధిర, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): మధిరలోని సరస్వతి విద్యాలయంలో 2011 లో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించుకున్నారు. ప్రధాన ఉపాధ్యాయుడు పైడిపల్లి వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావులతో పాటు పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించి సరదాగా గడిపారు.



మధిరలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



కిష్టారంలో గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఆర్థికసాయం అందజేత

వైరా జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వైరా గ్రేట్ విజన్‌క్లబ్, లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో తమ కుమార్తె డాక్టర్ కాపా లోహిత జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఆమె తల్లిదండ్రులు డాక్టర్ కాపా మురళీకృష్ణ, చంద్రకళలు గురువారం మండలంలోని అష్ణగుర్తి గ్రామానికి చెందిన నర్సింగ్‌కోర్సు చదువుతున్న శ్రావణికి, అనారోగ్యంతో బాధపడుతున్న రాణికి సాయం అందజేశారు. శాంబాబు, తోటకూర శ్రీకాంత్, చింతలపూడి వెంకటేశ్వరరావు, ఉపేంద్రరావు, మరికంటి రాంగోపాల్, రమేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

వైరా జనవరి 16 (ఆంధ్రజ్యోతి): వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌ను గురువారం వైరాలో ఐకేపీ సిబ్బంది సన్మానించారు. ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి, ఆ తరువాత శాలువాతో సన్మానించారు. ఏన్కూరు, వైరా, కొణిజర్ల సిబ్బంది మాదాసు వెంకటరామారావు, వెంకటేశ్వర్లు, నాగ పుల్లారావు, శ్రీనివాసరావు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.